

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 174

బుధవారం 14-9-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అన్ని అస్త్రాలతో ఆస్ట్రేలియాకు..

టీ20 ప్రపంచకప్ కోసం స్పష్టమైన వ్యూహంతో టీమిండియా - 14లో



5 నెలల గరిష్టానికి సూచీలు

సెన్సెక్స్ లాభం 456 పాయింట్లు.. 18,050 పైకి నిఫ్టీ - 15లో



కోల్‌కతా రణరంగం

కోల్‌కతాలో బీజేపీ తలపెట్టిన ర్యాలీ ఘర్షణలకు దారి తీసింది. పోలీసులతో బీజేపీ కార్యకర్తలు బాహాబాహీ తలపడ్డారు.

వివరాలు 7లో



బీజేపీ అశాంతిని రాజేస్తోంది

'ఓం శాంతి' అని హిందూత్వం ప్రబోధిస్తే.. బీజేపీ దేశంలో అశాంతిని పెంచుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు.

వివరాలు 7లో



అమిత్ షా X కేజ్రీవాల్

గుజరాత్ రాజకీయాలు వేడెక్కాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆప్ నేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మధ్య మాటల తూటాలు పేలాయి.

వివరాలు 7లో



చిన్నారిపై డ్రైవర్ అఘాయిత్యం

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో నర్సరీ చదువుతున్న మూడున్నరేళ్ల చిన్నారిపై స్కూలు బస్ డ్రైవర్ అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

వివరాలు 7లో

క్యాన్సర్‌ను అణిచేద్దాం

నివారణ, నియంత్రణ, చికిత్సపై ప్రత్యేక దృష్టి

వైద్య ఆరోగ్య శాఖపై ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ప్రతి మెడికల్ కాలేజీలో ప్రత్యేక క్యాన్సర్ విభాగం ఏర్పాటు
- ఇప్పటికే ఉన్న క్యాన్సర్ విభాగాలు మరింత బలోపేతం
- విజయవాడ, అనంతపురం, కాకినాడ, గుంటూరు బోధన ఆస్పత్రుల్లో 4 లైనాక్ మెషీన్లు
- మిగిలిన చోట్ల కూడా దశల వారీగా ఏర్పాటుకు చర్యలు
- శ్రీకాకుళం, నెల్లూరు, ఒంగోలు ఆస్పత్రుల్లో లైనార్ బంకర్ల నిర్మాణం
- మరో 7 మెడికల్ కాలేజీల్లో క్యాన్సర్ విభాగాల ఆధునికీకరణ
- జిల్లాల్లో వైద్య కార్యకలాపాలకు కేంద్రంగా ప్రతి టీచింగ్ ఆస్పత్రి
- 'ఫ్యామిలీ డాక్టర్' పర్యవేక్షణకు జిల్లాల్లో ప్రత్యేక అధికారి
- అందరికీ అందుబాటులో ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్ ఆస్పత్రుల వివరాలు
- మరింత పారదర్శకంగా పేమెంట్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్యాన్సర్ నివారణ, నియంత్రణ, చికిత్సలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఉన్న మెడికల్ కాలేజీలతోపాటు కొత్తగా నిర్మించనున్న వాటిలో కూడా ప్రత్యేక క్యాన్సర్ విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి టీచింగ్ ఆస్పత్రి కేన్సర్ కేర్ అండ్ ట్రీట్‌మెంట్‌కు సెంటర్ కావాలని స్పష్టం చేశారు. ఆస్పత్రుల్లో ఇదివరకే ఉన్న క్యాన్సర్ విభాగాలను బలోపేతం చేయడంతో పాటు, లేని వాటిలో సదుపాయాలు

మిగతా 3వ పేజీలో ▶

"ఆరోగ్యశ్రీ కింద చికిత్స అనంతరం పేషెంట్‌కు ఇంకా అదనంగా మెడికేషన్ అవసరమైన పక్షంలో సంబంధిత వైద్యాధికారితో ఏఎన్ఎం మాట్లాడాలి. తగిన చికిత్స అందించేలా చూడాలి. ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్ ఆస్పత్రుల వివరాలను విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాల్లో అందుబాటులో ఉంచాలి. ఇందుకు సంబంధించి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో హోర్డింగ్ పెట్టాలి. 104 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసిన వెంటనే సమీపంలో ఎంప్యానెల్ ఆస్పత్రి ఎక్కడుందో వివరాలు తెలిపేలా చర్యలు తీసుకోవాలి."

\- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

అందుబాటులో క్యాన్సర్ మందుల ధరలు

- అత్యవసర ఔషధాల జాబితాలోకి మరో 34 ఔషధాలు
- సవరించిన జాబితా విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

7లో

ఏ పార్టీతోనూ సంబంధం లేదు

జయప్రకాష్ పవర్ వెంచర్స్ లిమిటెడ్

- సబ్ కాంట్రాక్టులు, ఇసుక దోపిడీలో నిజం లేదు
- ఓ పత్రిక తప్పుడు కథనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం
- నిర్దేశిత విధానంలో ఇసుక ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధానంలోనే తాము ఇసుక ఆపరేషన్స్ నిర్వహిస్తున్నామని జయప్రకాష్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ (జేపీవీఎల్) సంస్థ స్పష్టం చేసింది. తమకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధాలు లేవని, ఓ పత్రికలో ప్రచురించిన కథనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు జేపీవీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పంకజ్ గౌర్ మంగళవారం

మిగతా 3వ పేజీలో ▶

• నారాయణ స్వాహా..

బంధుగణంతో 'అసైన్డ్' మేత



అమరావతిలో నారాయణ బృందం కాజేసింది 169.27 ఎకరాలు

- బంధువులు, సన్నిహితులు, వియ్యంకుడితో కలసి నిరుపేదలకు వంచన.. రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు డబ్బులు మళ్లించి దళితులకు దగా
- మొత్తం 1,100 ఎకరాలను కొల్లగొట్టిన టీడీపీ పెద్దలు
- నారాయణే సూత్రధారిగా అసైన్డ్ భూ దోపిడీ.. ఐదుగురు అరెస్టు
- సీఐడీ దర్యాప్తుల్లో బట్టబయలైన బాగోతం 12లో

న్యూస్‌రీల్

పెట్టుబడిదారుల యాత్రను అడ్డుకుంటాం



రైతుల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పెట్టుబడిదారులు చేస్తున్న అమరావతి యాత్రను అడ్డుకుంటామని విద్యార్థి జేఏసీ నాయకులు హెచ్చరించారు. మూడు రాజధానులతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని.. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను గౌరవించాలని సూచించారు. అమరావతి యాత్రను వ్యతిరేకిస్తూ విశాఖలోని ఏయూ గేట్ వద్ద ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

వివరాలు 5లో ▸

ధవళేశ్వరం వద్ద గోదావరి దూకుడు



తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గోదావరి వరద ఉధృతి మరింతగా పెరిగింది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఎగువన భద్రాచలం వద్ద కూడా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

వివరాలు 16లో ▸

జన అజెండా

- రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- పాలన వికేంద్రీకరణ, పరిపాలన సంస్కరణలపై చట్టసభలు వేదికగా విస్తృత చర్చకు ప్రభుత్వం సిద్ధం
- అప్పులు, పెట్టుబడులు, వృద్ధి రేటు, ఇసుక, పోలవరం, మద్యం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, మహిళా సాధికారితపై చర్చ

12లో

కరకట్ట ఆక్రమణలైనా కూల్చాల్సిందే

మా దృష్టిలో ఎవరైనా ఒక్కటే: హైకోర్టు స్పష్టీకరణ

- ప్రభుత్వ భూములు, గ్రామ కంఠాలు, చెరువులు, నీటి కుంటలు, శ్మశానాల ఆక్రమణలపై పిటిషన్లు
- వీటన్నింటినీ సుమోటో పిల్‌గా పరిగణిస్తూ విచారణ
- 30–40 ఏళ్ల క్రితం నిర్మించిన అక్రమ కట్టడాలనూ తొలగించాలి
- అక్రమ నిర్మాణాల కూల్చివేతకు తగిన ఆదేశాలు ఇస్తాం
- ప్రభుత్వ భూముల ఆక్రమణలో రెవెన్యూ అధికారుల పాత్ర
- ఆక్రమణదారులతో కుమ్మక్కవడం వల్లే ఈ పరిస్థితి
- శ్మశానాలనూ వదలడం లేదంటూ ఘాటు వ్యాఖ్యలు
- వీటిపై అంశాల వారీగా విచారణకు వేర్వేరు తేదీలకు వాయిదా



సాక్షి, అమరావతి: కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని కరకట్టపై అక్రమ నిర్మాణాలన్నింటినీ కూల్చివేయాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ భూములు, గ్రామ కంఠాలు, చెరువులు, నీటి కుంటలు, ఇతర నీటి వనరులు, శ్మశానాలు తదితరాలను ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణాలను కూడా కూల్చివేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చి చెప్పింది. 30–40 సంవత్సరాల క్రితమే భూములను ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణాలను సైతం తొలగించాలంది. తమకు ఎవరైనా ఒక్కటేనని, ఈ విషయంలో నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా చెరువులు, నీటి వనరులు తదితరాలను

మిగతా 12వ పేజీలో ▶

ఆ జీఓలపై స్టే ఇవ్వం

- పాఠశాలల విలీనం, టీచర్ల హేతుబద్ధీకరణ ప్రభుత్వ విధాన నిర్ణయం
- ఆ నిర్ణయాన్ని అమలు చేయనిద్దాం.. అప్పుడే దాని మంచి చెడ్డలు తెలుస్తాయి
- తేల్చిచెప్పిన హైకోర్టు



సాక్షి, అమరావతి: పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీఓలపై ఎలాంటి స్టే ఇవ్వబోమని హైకోర్టు తేల్చిచెప్పింది. పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమన్న హైకోర్టు, ఆ నిర్ణయాన్ని అమలుచేయనిద్దామని, అప్పుడే అందులో మంచి చెడ్డలు ఏమిటో తెలిసే అవకాశముంటుందని హైకోర్టు స్పష్టంచేసింది. స్టే ఇస్తే మొత్తం ప్రక్రియ ఆగిపోతుందని, అందువల్ల ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు

మిగతా 12వ పేజీలో ▶

26 నుంచి అక్టోబర్ 6 వరకు స్కూళ్లకు దసరా సెలవులు 3లో

ఆ వ్యాఖ్యల వెనుక బాబు



'రాయలసీమకు చుక్క నీరు ఇవ్వం' అంటూ అమరావతి యాత్రికులు చేసిన వ్యాఖ్యల వెనుక చంద్రబాబు రహస్య అజెండా ఉంది. ప్రాంతాల మధ్య చంద్రబాబు విద్వేషాలను రెచ్చగొడుతున్నారు' అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. 16లో

అది టీడీపీ శవయాత్ర



రైతుల పేరుతో చంద్రబాబు చేయిస్తున్న అమరావతి పాదయాత్ర.. రాజకీయంగా టీడీపీకి శవ యాత్రగా మారబోతోందని మంత్రి జోగి రమేష్ అన్నారు. యాత్రకు ప్రజల మద్దతు ఉంటే బౌన్సర్లు ఎందుకని ప్రశ్నించారు. 16లో

ఉత్తరాంధ్ర నాశనాన్ని కోరతారా?



ఉత్తరాంధ్రను నాశనం చేయాలని అరసవల్లి స్వామిని కోరతారా అని చంద్రబాబును మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు. అమరావతి పాదయాత్ర.. ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు చేస్తున్న యాత్ర అని దుయ్యబట్టారు. 16లో

IT'S NOT JUST A PROMISE.
IT'S A GENUINE PERFORMANCE.... Since 1985

For more Informtion
Scan QR

Feathers in our Cap..

- NBA — 7 TIMES ACCREDITED in 1998, 2002, 2007, 2012, 2017, 2021 & 2022
- NAAC 'A+' GRADE Cycle 2 In 2021
- nirf INDIA RANKING 2022 In the Band of 201-250 Engineering Category
- ARIIA BELOW 100 EXCELLENT BAND
- TÜV SÜD ISO 9001 CERTIFIED
- THE WEEK AIR-81 RANKED 1st in A.P
- HYM Certified for GOOD HYGIENE PRACTICES

EAPCET CODE : RVJC

PLACEMENT DETAILS - 2022

TOTAL OFFERS - 1504

TOTAL COMPANIES - 74

Pay Packages

≥50.0L CTC - 1
≥40.0L CTC - 8 | ≥20.0L CTC - 13
≥10.0 LPA - 28 | ≥6.0 LPA - 202 | ≥5.0 LPA - 238
≥4.0 LPA - 774 | ≥ 3.36 LPA - 1380 | ≥3.0 LPA - 1411

OUR TOP RECRUITERS

Recruiter	Offers
Cognizant	342
wipro	341
amazon	12
tcs TATA CONSULTANCY SERVICES	233
accenture High performance. Delivered.	118
Infosys	69

COURSES OFFERED

Undergraduate Courses:

- Computer Science & Engineering
- Computer Science and Engineering (DS)
- Computer Science and Engineering (AI&ML)
- Computer Science & Business System
- Information Technology
- Computer Science and Engineering (IOT)
- Electronics& Communication Engineering
- Electrical & Electronics Engineering
- Mechanical Engineering
- Chemical Engineering
- Civil Engineering

*Scholarship eligible candidates need not pay any tuition fee Under Category 'A'

POSTGRADUATE COURSES:

MBA, MCA
M.Tech in :
- Power Systems Engg
- Structural Engg
- Computer Science & Engg
- Computer Science & Technology
- Machine Design
- Communication Engg. & Signal Processing

STUDENTS FROM

ECE, EEE, Mechanical, Civil & Chemical Engineering Branches can do Minor Degree in
- CSE
- CSE (DS)
- CSE (AI & ML)
- CSE (IOT)
- Industrial Tracks : Full Stack, Cloud Computing, etc..

Branch	Total Offers	Highest Package
CE	62	6.5 L (Wipro Turbo)
CHE	47	6.5 L (Wipro Turbo)
CSE	435	50.05 L (DE Shaw)
ECE	324	10.33 L (Quinbay)
EEE	175	8 L (Netcracker)

Branch	Total Offers	Highest Package
IT	250	28 L (Amazon)
ME	139	6.5 L (Wipro Turbo)
M.Tech	1	5.25 L (ITS)
MCA	29	5 L (MOBIS)
MBA	42	5.6 L (Alien)

OUR HIGH-FLYERS

Offers in Amazon -12 Avg.Package - 36 Lakhs CTC

Peerless Package so far @ 50.5 Lakhs
P.HIMAJA -Y18CS138 DEShaw&Co

- J.THANMAYEE Y18CS058 amazon - SDET
- P.VIDYASAGAR Y1T8CS146 amazon - SDET
- GN.MANEESHA Y18IT024 amazon - SDE
- N.SAI SHANKAR Y18IT068 amazon - DE
- POORNA SAI TEJA Y18CS140 amazon - SDET
- V. SWATHI Y18CS173 amazon - SDET
- G.TEJASWINI Y18CS046 amazon - SDET
- M.NIHARIKA Y18CS104 amazon - SDE
- Y.SUSHMASRI Y18CS016 amazon - DE
- SAI MAHATHI Y18CS106 amazon - DE
- B.DILEEP Y18CS015 amazon - QAE

Our Legacy Continues in amazon -10
Till now offers for 2023 Batch Students in

- M.SAI PRASANNA Y19CS103 amazon - SDE
- MD.YASMIN Y19CS113 amazon - SDE
- M.NAVEEN Y19CS123 amazon - SDE
- B.CHANDAN Y19CS016 amazon - PAE
- P.DEEPTHI Y19CS141 amazon - SDE
- CH.VIJAYALAKSHMI Y19CB014 amazon - SDE
- T.BHARATHI Y19CS173 amazon - SDE
- R.V.HARIKA Y19CS148 amazon - SDE
- M.SASIPRIYA Y19CS106 amazon - SDE
- N.SAMKEERTHANA Y19CS126 amazon - SDE

DECIDE WISELY FOR A GOOD DESTINATION! Visit : www.rvrjcce.ac.in



R.V.R. & J.C.
COLLEGE OF ENGINEERING
(Autonomous)

Estd 1985 — KNOWLEDGE IS POWER

37 YEARS OF EXCELLENCE

(Sponsored by Nagarjuna Education Society, Approved by AICTE - Affiliated to Acharya Nagarjuna University)
Chandramoulipuram, Chowdavaram, Guntur - 522 019, Andhra Pradesh. Tel. : 09491073317, 18 www.rvrjcce.ac.in

పెట్టుబడుల ఆకర్షణలో ఏపీనే అగ్రగామి

డీపీఐఐటీ జూలై నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: పారిశ్రామిక పెట్టుబడులను అకర్షించడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అతి పెద్ద ఘనత సాధించింది. 2022 సంవత్సరంలో పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ)జూలై నెల నివేదికలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి విషయం వెల్లడైంది. ఈ ఏడాది తొలి ఏడు నెలల్లో దేశం మొత్తం మీద 1.71 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా.. అందులో ఆంధ్రప్రదేశ్ లోనే అత్యధికంగా రూ.40,361 కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు ఆ నివేదిక పేర్కొంది. రూ.36,828 కోట్ల పెట్టుబడులతో ఒడిశా రెండో స్థానంలో నిలిచింది. దేశంలో పెట్టుబడుల్లో ఈ రెండు రాష్ట్రాలది 45 శాతం అని డీపీఐఐటీ తెలిపింది.

క్లుప్తంగా

26 నుంచి అక్టోబర్ 6 వరకు దసరా సెలవులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు ఈనెల 26 నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 6 వరకు ఈ సెలవులుంటాయి. క్రిస్టియన్, మైనార్టీ స్కూళ్లకు మాత్రం అక్టోబర్ 1 నుంచి 6 వరకు సెలవులు ప్రకటించారు. స్కూళ్లు 7న తెరుచుకుంటాయి.

రాష్ట్రానికి 4 జైవిక్ ఇండియా అవార్డులు

సాక్షి, అమరావతి: ఆర్గానిక్ ఫుడ్ ఇండియా పోటీల్లో రాష్ట్రానికి నాలుగు ప్రతిష్టాత్మక పాన్ ఇండియా అవార్డులు లభించాయి. 2022-23 కి సంబంధించి జైవిక్ ఇండియా నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణ కోసం కృషిచేస్తున్న రైతు సాధికార సంస్థకు జైవిక్ ఇండియా అవార్డు దక్కింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవోల) విభాగంలో పార్వతీపురానికి చెందిన మాభూమి ప్రకృతి వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి, అల్లూరి సీతారామరాజు జిల్లా మాడుగులకు చెందిన నిట్టపుట్టు ప్రకృతి వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి అవార్డులు లభించాయి. వ్యక్తిగత విభాగంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్న వైఎస్సార్ జిల్లాకు చెందిన బండి ఓబులమ్మకు అవార్డు దక్కింది. ఈ నెల 23న ఆగ్రాలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు.

అవార్డు రావడం ఆనందంగా ఉంది.



2016 నుంచి నేను ప్రకృతి సాగుచేస్తున్నా. ఎనిమిదెకరాల్లో నిమ్మ, రెండెకరాల్లో 10 రకాల కూరగాయలు సాగుచేస్తున్నా. ఎకరాకు రూ.4.80 లక్షలు ఖర్చవుతుండగా రూ.11.70 లక్షల ఆదాయం వస్తోంది. ప్రకృతి ఉత్పత్తులను సొంతంగా మార్కెటింగ్ కూడా చేసుకుంటున్నా. ప్రతిష్టాత్మక జైవిక్ ఇండియా అవార్డు లభించడం ఆనందంగా ఉంది.

– బండి ఓబులమ్మ,
టి.కొత్తపల్లి, వైఎస్సార్ జిల్లా

టీడీపీలో వర్గ పోరు

- బీసీలను అవమానించారంటూ బుద్దా, నాగుల్ మీరా నిరసన

సాక్షి ప్రతినిధి, విజయవాడ: టీడీపీలో వర్గపోరు మరోసారి బట్టబయలైంది. మంగళవారం ఇక్కడ జరిగిన కృష్ణా జిల్లా టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో పలువురు నేతలు నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీసీలు, మైనార్టీలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం, ఫ్లెక్సీల్లో వారి ఫొటోలు లేకపోవడంతో కొందరు నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలను అవమానించారంటూ ఆ పార్టీ నేతలు బుద్దా వెంకన్న, నాగుల్ మీరా నిరసన వ్యక్తం చేసి, సమావేశాన్ని బహిష్కరించారు. ఇక్కడి పరిస్థితులు చూసి జీవితంలో మొదటిసారి కన్నీళ్లు పెట్టుకున్నానని వెంకన్న వ్యాఖ్యానించారు. వీరిద్దరినీ సముదాయించడానికి కొందరు నేతలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను వేదిక మీదకు పిలవకపోవడంపై ఆయన వర్గం నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సభలో కొంత గందరగోళం నెలకొంది. ఈ సమావేశానికి ఎంపీ కేశినేని నాని కూడా హాజరు కాలేదు. సమావేశంలో పాల్గొనడానికి ఇష్టం లేకే ఎంపీ ఢిల్లీ వెళ్లినట్లు సమాచారం.

నానో యూరియాపై అవగాహన కల్పించండి

సాక్షి, అమరావతి: నానో యూరియా వినియోగాన్ని పెంచేందుకు ఆర్బీకేల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్ చెప్పారు. అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, డీఏపీ, యూరియా, పొటాష్ జిల్లాలకు సరిపడా సరఫరా చేస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్ కేవైసీ 68 శాతం పూర్తయిందని, 18వ తేదీలోపు ప్రతి జిల్లాలో 70శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

నాడు–నేడు దేశానికే ఆదర్శం

విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

ఒంగోలు మెట్రో: ఆధునిక సౌకర్యాల నడుమ పిల్లలు చదువుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మనబడి నాడు–నేడు కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్నారు. మనబడి నాడు–నేడు రెండో విడతకు సంబంధించిన అవగాహన సదస్సు మంగళవారం ఒంగోలులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధనవంతుల పిల్లలతో సమానంగా పేదల పిల్లలు కూడా ఆధునిక సౌకర్యాలు, తరగతి గదుల్లో విద్యనభ్యసించాలనే ఆశయంతో సీఎం జగన్ ఈ పథకానికి రూపకల్పన చేశారని చెప్పారు. గతంలో విద్యార్థినులు కాలకృత్యాలు తీర్చుకోవాలంటే.. సాయంత్రం ఇంటికి వెళ్లే వరకు వేచి ఉండాల్సిన దయనీయ పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. అలాంటి కష్టాలకు ప్రభుత్వం చరమగీతం పాడిందన్నారు. ఇంటర్ విద్య కమిషనర్ ఎంవీ శేషగిరిరావు మాట్లాడుతూ.. నిర్ణీత గడువైన ఆరు నెలల్లోగా పనులు నాణ్యంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పథకం ఆచరణ గురించి ప్రత్యేక సలహాదారు ఆకునూరి మురళి వివరించారు. సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్, సమగ్ర శిక్ష చీఫ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, నాడు నేడు నోడల్ అధికారి సుశీల, ఇంటర్ విద్య ఆర్జేడీ సుబ్బారావు, అధికారులు ఎస్వీ సుబ్బారావు, కె.ఆంజనేయులు, సైమన్ విక్టర్, ప్రసాదరావు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, ఇంటర్ విద్య కమిషనర్ శేషగిరిరావు తదితరులు

ఏపీలో రేషన్ డోర్ డెలివరీ భేష్

- వలంటీర్ల వ్యవస్థ, ఇంటింటికీ పంపిణీని ప్రశంసించిన కేంద్ర బృందం
- అన్నమయ్య జిల్లాలో రేషన్ షాపుల పరిశీలన
- లబ్ధిదారులు సైతం సంతృప్తి వ్యక్తం చేశారని వెల్లడి

మదనపల్లె: జాతీయ ఆహార భద్రత చట్టం అమల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో పౌర సరఫరాల వ్యవస్థ పనితీరు, రేషన్ డోర్ డెలివరీ, వలంటీర్ల వ్యవస్థ సమర్థంగా పనిచేస్తున్నాయని కేంద్ర బృందం సభ్యులు ప్రశంసించారు. జాతీయ ఆహారభద్రత చట్టం అమలు, పీడీఎస్ పంపిణీని క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసేందుకు నియమించిన కేంద్ర పరిశీలకుల బృందం మంగళవారం అన్నమయ్య జిల్లాలో పర్యటించింది. గాలివీడు, కురబలకోట, లక్కిరెడ్డిపల్లె, చిన్నమండ్యం, మదనపల్లె తదితర ప్రాంతాల్లో రేషన్ షాపులను తనిఖీచేసి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జాతీయ ఆహారభద్రత చట్టం సలహా సంఘం సభ్యులు జీఎస్ శర్మ, ఎంసీ చింపా మీడియాతో మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆహార భద్రత చట్టం అమలు ఏపీలో బాగా జరుగుతోందని కితాబిచ్చారు. పౌరసరఫరాల పంపిణీకి ఎండీయూ వాహనాలు, వలంటీర్ల వ్యవస్థ, రేషన్ డోర్ డెలివరీ సత్ఫలితాన్నిస్తున్నాయని ప్రశంసించారు. 100కి 98శాతం మంది ప్రజలు రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పొందుతున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. రేషన్ సరుకుల పంపిణీపై లబ్ధిదారులను విచారిస్తే.. సేవలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.



రేషన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

క్యాన్సర్‌ను అణిచేద్దాం

▶ మొదటి పేజీ తరువాయి

కల్పించాలని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాలపై మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. విజయవాడ, అనంతపురం, కాకినాడ, గుంటూరు ఆస్పత్రుల్లో 4 లైనాక్ మెషీన్లు (రేడియేషన్ ఇచ్చే యంత్రాలు) ఏర్పాటు చేయడానికి.. శ్రీకాకుళం, నెల్లూరు, ఒంగోలు ఆస్పత్రుల్లో లైనార్ బంకర్ల (వైద్య అవసరాలు తీర్చే గది.. ఉదా: హై ఎనర్జీ – ఎక్స్‌రే) నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మరో 7 పాత మెడికల్ కాలేజీల్లో కేన్సర్ శస్త్రచికిత్సల కోసం ఆపరేషన్ థియేటర్ల అప్‌గ్రేడేషన్, పాథాలజీ డిపార్ట్‌మెంట్లలో ఆధునిక సౌకర్యాలు, కీమో థెరపీ, డ్రగ్స్ తదితర సదుపాయాల కల్పనకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి టీచింగ్ ఆస్పత్రి ఆ జిల్లాకు సంబంధించిన వైద్య కార్యకలాపాలకు సెంటర్‌గా వ్యవహరించాలని, విలేజ్ క్లినిక్స్ దగ్గర నుంచి ఆ ఏరియాలో ఉన్న ప్రతి ఆస్పత్రి కూడా బోధనాస్పత్రి పరిధిలోకి రావాలన్నారు. దీనివల్ల క్యాన్సర్ లాంటి వ్యాధులను గుర్తించి, వైద్యం అందించడం సులభతరమవుతుందని చెప్పారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో 12 రకాల రాపిడ్ డయాగ్నోస్టిక్స్ కిట్లు, 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. విలేజ్ క్లినిక్స్ విధివిధానాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి నాణ్యతపై నిరంతర పరిశీలన ఉండాలని, ప్రతి నెలా తప్పనిసరిగా నివేదికలు పంపాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పర్యవేక్షణకు జిల్లాల్లో ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

రక్తహీనత కేసులు ఉండకూడదు

- చిన్నారులు, మహిళల్లో రక్తహీనత నివారణకు ఇప్పటికే పలు చర్యలు తీసుకున్నాం. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందుతున్న తీరుపై నిరంతరం పర్యవేక్షణ చేయాలి. రక్తహీనత అధికంగా ఉన్న ప్రాంతాల్లో అదనంగా పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.
- వైద్యాధికారుల సిఫార్సు మేరకు వైద్య పరంగా, ఆహార పరంగా వారిపై దృష్టి పెట్టడం ద్వారా రాష్ట్రంలో రక్తహీనత కేసులు రాకుండా చూడాలి. వ్యవసాయానికి ఆర్బీకేలు ఎలా అండగా నిలుస్తున్నాయో ప్రజారోగ్యం విషయంలో విలేజ్ క్లినిక్‌లు కూడా అలాగే కీలక పాత్ర పోషించాలి. పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణం అనుకున్న రీతిలో పూర్తి చేయాలి.
- స్కూళ్లలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షణ జరగాలి. పిల్లల ఆరోగ్య పరిస్థితులను కనుక్కోవడంతోపాటు నిరంతరం కంటి పరీక్షలు చేయాలి.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల కోసం సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. ఇందుకు సంబంధించి వెంటనే నియామకాలు పూర్తి చేయాలి. (అక్టోబర్ 15లోగా పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు) సదుపాయాలను మెరుగు పరచాలి. అప్పుడే ప్రజలు ప్రభుత్వాస్పత్రుల సేవలను మెరుగ్గా వినియోగించుకుంటారు.
- ఆరోగ్య శ్రీ కింద అక్టోబర్ 2 నాటికి మొత్తం 3,118 వైద్య ప్రక్రియలకు చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలి.

'నాడు–నేడు'పై ప్రతివారం సమీక్ష

- రాష్ట్రంలో చేపట్టిన కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాల పురోగతితో పాటు ప్రస్తుతం ఉన్న మెడికల్ కాలేజీల్లో నాడు–నేడు పనులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ప్రతివారం సమీక్ష చేయడంతో పాటు నిర్దేశించుకున్న సమయంలోగా నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలి.
- సమావేశంలో మంత్రి విడదల రజని, ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శి (కోవిడ్ మేనేజ్‌మెంట్ అండ్ వ్యాక్సినేషన్) ముద్దాడ రవిచంద్ర, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్ గుల్జార్, ప్రత్యేక కార్యదర్శి నవీన్ కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరీంద్రప్రసాద్, ఏపీవీవీపీ కమిషనర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.



వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్

ఆరోగ్య శ్రీ మరింత పటిష్టం

'లబ్ధిదారులకు వర్చువల్ అకౌంట్లు క్రియేట్ చేశాం. వీటి ద్వారా ఆరోగ్యశ్రీ డబ్బు నేరుగా ఆస్పత్రులకు వెళ్తుంది. డబ్బులు డిడక్ట్ అవగానే పేషెంట్ సెల్‌ఫోన్‌కు ఎస్ఎంఎస్ వస్తుంది. రోగులు డిశ్చార్జి అయ్యేటప్పుడు వారికి అందిన వైద్య సేవలపై కన్సెంట్ లెటర్ కూడా తీసుకుంటున్నాం. లంచాలు లాంటివి ఉంటే ఫిర్యాదుకు ఏసీబీ 14400 నంబర్ పెట్టాం. పేషెంట్ డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిన తర్వాత కూడా ఏఎన్ఎం వారి ఇంటికి వెళ్లి ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. ఆస్పత్రిలో వైద్య సేవలు, ఆరోగ్య మిత్రల పని తీరుపై అభిప్రాయాలు తీసుకుంటారు. ఆ తర్వాత సెల్ఫీ తీసుకుని అప్‌లోడ్ చేస్తారు' అని అధికారులు సీఎంకు వివరించారు.

• తెలంగాణ

బ్యాటరీ పేలుడు వల్లే..

- సికింద్రాబాద్ అగ్నిప్రమాద ఘటనపై పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
- ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని రూబీ ఎలక్ట్రికల్ స్కూటర్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదానికి ఈ–స్కూటర్ బ్యాటరీ పేలడమే కారణమని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. దట్టమైన పొగ ప్రభావంతోనే లాడ్జిలో బస చేసిన వాళ్లు చనిపోయినట్లు తేల్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఒకరు మంగళవారం మృతిచెందడంతో ఈ దుర్ఘటనలో కన్నుమూసిన వారిసంఖ్య ఎనిమిదికి చేరింది. చికిత్స పొందుతున్న వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అగ్నిప్రమాదం జరిగిన హోటల్, విద్యుత్ ద్విచక్ర వాహనాల షోరూమ్ నిర్వహిస్తున్న రాజేందర్‌సింగ్ బగ్గా, సుమిత్‌సింగ్‌లతోపాటు మరికొందరిపై మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

లాడ్జిలోకి వ్యాపించిన పొగలు

హైదరాబాద్‌లోని కార్ఖానా ప్రాంతానికి చెందిన రాజేంద్రసింగ్ బగ్గా, సుమిత్‌సింగ్ కొన్నేళ్లుగా సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ రోడ్డులో రూబీ ప్రైడ్ లగ్జరీ హోటల్ పేరుతో లాడ్జి నిర్వహిస్తున్నారు. రెండేళ్ల కిందట ఓ సంస్థకు చెందిన ఈ–స్కూటర్స్ డీలర్‌షిప్ తీసుకుని షోరూం, సర్వీసింగ్ సెంటర్లను లాడ్జి గ్రౌండ్‌ఫ్లోర్, సెల్లార్‌లో అక్రమంగా ఏర్పాటు చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో రిసెప్షన్, ఈ–స్కూటర్స్ కార్యాలయం, మొదటి అంతస్తు నుంచి నాలుగో అంతస్తు వరకు మొత్తం 28 గదులు ఉన్నాయి. ఐదో అంతస్తులోని పెంట్‌హౌస్‌లో రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి 9:17 గంటలకు సెల్లార్‌లోని ఈ–స్కూటర్స్ సర్వీసింగ్ పాయింట్‌లో చార్జింగ్ పెట్టిన ఈ–స్కూటర్ బ్యాటరీ పేలడంతో మంటలు అంటుకున్నాయి. పక్కనున్న వాహనాలకు, నిల్వ ఉంచిన టైర్లు, ప్లాస్టిక్, రబ్బర్ వస్తువులకు మంటలు అంటుకోవడంతో దట్టమైన పొగ, విషవాయువులు వెలువడ్డాయి. ఆ సమయంలో లాడ్జిలో 25 మంది అతిథులు, ఎనిమిదిమంది ఉద్యోగులు ఉన్నారు. భవనాన్ని సరైన వెంటిలేషన్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడం, ఐదో అంతస్తు నుంచి సెల్లార్ వరకు నిర్మించిన మెట్లమార్గం మీటరు కంటే తక్కువ వెడల్పుతో ఇరుగ్గా ఉండటంతో ప్రమాద సమయంలో అదే చిమ్నీ గొట్టంలాగా మారిపోయింది. సెల్లార్ నుంచి విషవాయువులు, నల్లటి పొగ దీనిద్వారానే లాడ్జి మొత్తం వ్యాపించాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో స్టెయిర్ కేస్‌కు, రిసెప్షన్‌కు మధ్య తలుపు మూసి ఉండటంతో పొగ బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. పొగను గమనించిన సిబ్బంది బయటకు పరుగులు తీయగా మొదటి, రెండో అంతస్తుల్లో బసచేసిన వారిలో నలుగురు గదుల్లోను, ముగ్గురు మెట్ల మార్గంలోను ప్రాణాలు విడిచారు. మరో 10 మంది అస్వస్థతకు గురయ్యారు. మూడు, నాలుగో అంతస్తుల్లో బసచేసిన కొందరిని స్థానికులు, పోలీసులు, అగ్నిమాపకశాఖ వారు కాపాడారు. పెంట్‌హౌస్‌లో భోజనం చేస్తున్న నలుగురు పక్కభవనం టెర్రస్‌పైకి చేరుకుని ప్రాణాలు కాపాడుకున్నారు.

రూ.3 లక్షల చొప్పున పరిహారం

మృతుల కుటుంబాలకు సీఎం కేసీఆర్ రూ.3 లక్షల నష్టపరిహారం ప్రకటించారు.

కేంద్రం రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా

సాక్షి, న్యూఢిల్లీ: సికింద్రాబాద్ అగ్నిప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయనిధి నుంచి రూ.2 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని ప్రధాని కార్యాలయం ట్వీట్ చేసింది.

మృతులు వీరే..

1. అల్లాడి హరీష్ (33)	విజయవాడ
2. వీరేందర్‌కుమార్ దేవకార్ (50)	ఢిల్లీ
3. రాజీవ్‌మాలిక్	"
4. సందీప్‌మాలిక్	"
5. సీతారామన్ (48)	చెన్నై
6. బాలాజీ (58)	"
7. చందన్ జేథి (30)	ఒడిశా
8. మిథాలి మహాపాత్ర	(29)

ఏ పార్టీతోనూ సంబంధం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

ఒక ప్రకటన విడుదల చేశారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా తమ సంస్థపై అసత్యాలతో కూడిన వార్తలను ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. జేపీవీఎల్ ఇసుక సబ్ కాంట్రాక్టులను అధికార పార్టీ నేతలకు జిల్లాల వారీగా ఇచ్చినట్లు ఎల్లో మీడియా రెండు రోజులుగా తప్పుడు కథనాలను ప్రచురిస్తోంది. ప్రభుత్వమే ఈ సబ్ కాంట్రాక్టులను ఇస్తున్నట్లు, ఇసుకలో భారీ దోపిడీ జరుగుతున్నట్లు అసత్య కథనాలను వెలువరిస్తోంది. ఈ నేపథ్యంలో దీనిపై జేపీవీఎల్ సంస్థ స్పందించింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంఎస్‌టీసీ ద్వారా నిర్వహించిన టెండర్లలో తమ సంస్థ రాష్ట్రంలో ఇసుక ఆపరేషన్స్ నిర్వహణను దక్కించుకున్నట్లు పేర్కొంది. టెండర్లలో మిగిలిన సంస్థలతో పోటీ పడి తమ సాంకేతిక, ఆర్థిక సామర్థ్యాన్ని నిరూపించుకుని కాంట్రాక్టు పొందినట్లు వెల్లడించింది. టెండర్ నిబంధనల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన అన్ని నిబంధనలను పాటిస్తూ ఇసుక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. తమ సంస్థకు విద్యుత్, కోల్ మైనింగ్ రంగాల్లో విస్తారమైన అనుభవం ఉందని, తాము చేపట్టిన ఏ ప్రాజెక్టునైనా సమర్థంగా నిర్వహిస్తామని పేర్కొంది.



ఇతరులు లావాదేవీలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు..

రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు, విక్రయాలను నిర్వహించేందుకు టెండర్ల ద్వారా దక్కించుకున్న జేపీవీఎల్ అనుమతించిన వ్యక్తులకు మాత్రమే అవకాశం ఉందని జిల్లాల ఎస్పీలు స్పష్టం చేశారు. ఇతరులు ఎవరైనా ఇసుక సబ్ కాంట్రాక్టర్ లేదా ఇతర పేర్లతో లావాదేవీలు జరిపితే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సబ్ కాంట్రాక్టులు పొంది జిల్లాల వారీగా విక్రయాలను నిర్వహిస్తున్నట్లు ఎవరైనా ప్రచారం చేసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జేపీవీఎల్ పోలీస్ శాఖను కోరినట్లు తెలిపారు.

సిక్కోలు, ఉమ్మడి విశాఖలో కుంభవృష్టి

- భీమునిపట్నంలో 17.9 సెం.మీ.. గారలో 15 సెం.మీ. వర్షపాతం
- నందిగాంలో పిడుగుపాటుకు రైతు బలి
- శ్రీకాకుళం నగర రోడ్లన్నీ జలమయం
- జాతీయ రహదారిపైకి వరద నీరు
- 13 మండలాల్లో విద్యాసంస్థలకు సెలవు
- లోటు నుంచి అధిక వర్షపాతానికి చేరుకున్న విశాఖ



పెదపాడు జాతీయరహదారిపై వరద నీటిలో కొట్టుకుపోతున్న కారును ఒడ్డుకు చేరుస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/సాక్షి, విశాఖపట్నం: శ్రీకాకుళం జిల్లాలో మంగళవారం వేకువజాము నుంచి కుండపోతగా వర్షం కురిసింది. గార మండలంలో దాదాపు 15 సెం.మీ. వర్షం పడగా, శ్రీకాకుళంలో 7, ఆమదాలవలసలో 6, నరసన్నపేటలో 4 సెం.మీ. పైగా వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఒక్కరోజే 722 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. భారీ వర్షానికి శ్రీకాకుళం నగర రోడ్లన్నీ జలమయమయ్యాయి. సూర్యమహల్ వద్ద ముంపు అంచనా వేయలేకపోవడంతో ఓ కారు కల్వర్టులోకి దూసుకెళ్లిపోయింది. పెదపాడు చెరువు పొంగి ప్రవహించడంతో జాతీయ రహదారిపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. వాహనాలు మునిగిపోయేంత మేర నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై నీటిని కల్వర్టుల ద్వారా మళ్లించారు. ఇక నందిగాం మండలం కాపుతెంబూరుకు చెందిన రైతు కొల్లి వనజనాభం (40) పొలంలో నీటిని మళ్లిస్తుండగా పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. భారీ వర్షాలతో 13 మండలాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

ఉమ్మడి విశాఖలోనూ కుండపోత..

మరోవైపు.. ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ కుంభవృష్టి కురిసింది. సోమవారం అర్ధరాత్రి దాటాక మొదలైన వర్షం మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. విశాఖ నగర శివారుల్లో పల్లపు ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరింది. భీమునిపట్నంలో అత్యధికంగా 17.9 సెం.మీల వర్షపాతం రికార్డయింది. గోపాలపట్నంలో 12.1, విశాఖ రూరల్‌లో 10.8, గాజువాక 8.2, అనకాపల్లి జిల్లా పరవాడలో 6.3, అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 4.8, చింతపల్లిలో 4.6 సెం.మీల చొప్పున వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి వర్షం తగ్గుముఖం పట్టింది.

రుతుపవన ద్రోణితో భారీ వర్షాలు

ఇక రుతుపవన ద్రోణి చురుగ్గా ఉండడం భారీ వర్షాలకు దోహదపడిందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాల సీజనులో ఇప్పటివరకు ఒక్క విశాఖ జిల్లా మాత్రమే లోటులో ఉంది. నాలుగు రోజుల క్రితం వరకు ఈ జిల్లా వర్షపాతం సాధారణం కంటే 20.9 శాతం లోటులో ఉండేది. కానీ, ప్రస్తుత వర్షాలతో 3.9 శాతం అధిక వర్షపాతానికి చేరుకుంది. అంటే మూ్డ్రోజుల వ్యవధిలో దాదాపు 24 శాతం వర్షపాతం పెరిగినట్లయింది.

ఈనాడువి బిల్డప్ రాతలు

మాజీమంత్రి, కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: 'రాష్ట్రంలో తిరుగులేని జనశక్తితో అమరావతి పాదయాత్ర మహోద్యమంలా జరుగుతోందన్నట్లు 'ఈనాడు' బిల్డప్.. జయహో అమరావతి అని బ్యానర్.. లోపలి పేజీల్లోకి వెళ్తే ఈ ఉద్యమం మనది, దానిని కాపాడుకోవాలన్నట్లు పుంఖానుపుంఖాలుగా కథనాలు. అవి చూస్తే ఆశ్చర్యం వేసింది'.. అని మాజీమంత్రి కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఈరోజు ఈనాడు మొత్తం చదివాను. అమరావతి పాదయాత్రకు వచ్చిన వారి ఫొటోలు వేశారు. వారేం అనుకుంటున్నారో మనసులో మాట కూడా చెప్పారు. జేఏసీ నాయకులు 'నారా హమారా.. అమరావతి హమరా' అంటూ నినాదం ఇచ్చారట. దీనినిబట్టి ఈ మొత్తం కథ నారా వారి దర్శకత్వం, నిర్మాణంలోనే అమరావతి పాదయాత్ర జరుగుతున్నట్లు రాష్ట్ర ప్రజలకు అర్థమవుతోంది. కానీ, మేము, ప్రజలు 'నారా తుమ్హారా.. అమరావతి తుమ్హారా' అని చెబుతున్నాం.



ఈనాడు పేపర్‌ను చూపుతున్న కన్నబాబు

ఒక పార్టీ కోసమే ఇదంతా..

ఇక అమరావతిపై ప్రెస్‌మీట్ పెడితే టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పందిస్తారు. అలాగే, అమరావతిపై ఉద్యమం అయితే తెలంగాణ నుంచి రేణుకాచౌదరి వస్తారు. ఈ పాదయాత్రలో బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఒకే ట్రాక్టర్‌పై టీడీపీ నేత మాగంటి బాబు, సీపీఐ నారాయణ కూర్చున్నారు. ఈ మొత్తాన్ని చూసి ఒక రాజకీయ పార్టీ అవసరాల కోసం, దాని ప్రోత్సాహం కోసం కొంతమంది ఈ ఉద్యమం నడుపుతున్నారని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఈనెల 15 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో 'నారా హమారా.. అమరావతి హమారా' నినాదంపై చర్చిద్దాం రండి. ఇక కులంలో కొడాలి నాని చెడపుట్టాడంటూ బుచ్చయ్య చౌదరి అంటున్నారు. టీడీపీకి మద్దతిచ్చే వారే గౌరవప్రదులా? కర్నూలులో న్యాయ రాజధాని, విశాఖలో పరిపాలన రాజధాని వద్దనడానికి మీకు హక్కు ఎక్కడిది? అమరావతి శాసన రాజధానిగా ఉంటుంది. ప్రాంతాల మధ్య వైషమ్యాలు వచ్చేలా టీడీపీ మాట్లాడితే చూస్తూ ఊరుకోం'.

అభిమాన అభిషేకం



వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను అక్టోబర్ ఒకటో తేదీ నుంచి అమలు చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేస్తూ పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలు, భవన నిర్మాణ కార్మికులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. చిలకలూరిపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి భాస్కర్ సెంటర్‌లో ఉన్న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పాల్గొని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. –చిలకలూరిపేట

పదం కలుపుతున్న పల్లె

సంక్షేమ సారథులకు గడపగడపనా ఘనస్వాగతం

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా సాగుతోంది. గ్రామాలకు వెళ్తున్న ప్రజాప్రతినిధులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. అన్ని జిల్లాల్లో మంగళవారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కు, నాయకులకు తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రజలు దీవిస్తున్నారు.



కృష్ణా జిల్లా కంకిపాడు మండలం దావులూరులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలం ఏటూరులో పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఈ ఏడాదే గగన్‌యాన్ తొలి ప్రయోగం: కేంద్రం

న్యూఢిల్లీ: భారత తొలి మానవ సహిత అంతరిక్ష ప్రయోగం 2024లో ఉంటుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ మంగళవారం వెల్లడించారు. 2022లోనే చేపట్టాల్సిన ఈ ప్రయోగంపై కరోనా ప్రభావం పడిందన్నారు. రష్యాలో వ్యోమగాముల శిక్షణ కూడా కరోనా వల్లే వాయిదా పడిందన్నారు. ''గగన్‌యాన్ మిషన్ తొలి ప్రయోగ పరీక్ష ఈ ఏడాది చివర్లో ఉంటుంది. అంతరిక్ష నౌకను 15 కిలో మీటర్ల ఎత్తుకు ప్రయోగిస్తారు. క్యాప్సూల్‌ను పారాచ్యూట్ల సాయంతో భూమిపైకి తీసుకొస్తారు. రెండోసారి అంతరిక్ష నౌకను మరింత ఎత్తుకు తీసుకెళ్తారు'' అని అధికారులు వెల్లడించారు. వచ్చే ఏడాది చేపట్టే మరో యాత్రలో మహిళ ముఖ కవళికలుండే వ్యోమ్ మిత్ర అనే హ్యూమనాయిడ్‌ను పంపిస్తామని మంత్రి తెలిపారు.

క్లుప్తంగా...

ఎన్నికల్లో పోటీ చేయడం ప్రాథమిక హక్కు కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీచేయడం ప్రాథమిక హక్కు, చట్టపరమైన హక్కు పరిధిలోకి రాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ మేరకు వాదించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేసింది. ''ఎన్నికల్లో పోటీ చేయడమనేది శాసనం ద్వారా అమలయ్యే హక్కు మాత్రమే. ఎన్నిక స్వభావాన్ని బట్టి అభ్యర్థిని బలపరిచే, ప్రతిపాదించే వారికి సంబంధించిన విధి నిషేధాలు, నియమ నిబంధనలు ప్రజాప్రాతినిధ్య చట్టం, ఎన్నికల నిర్వహణ నిబంధనల్లో స్పష్టంగా పొందుపరిచి ఉన్నాయి'' అని గుర్తు చేసింది. ప్రపోజర్ లేని కారణంగా రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి తనను అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ ఒక వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. ఇది తన ప్రాథమిక హక్కును హరించడమేనన్న వాదనను తోసిపుచ్చింది.

అమిత్ షా, కేజ్రీవాల్ మాటల తూటాలు

అహ్మదాబాద్: గుజరాత్ ఎన్నికల ప్రచారంలో వేడి రాజుకుంటోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ''కలలతో వ్యాపారం చేయాలనుకునే వాళ్లను గుజరాత్ ప్రజలు ఆదరించరు. వారి కలలు ఎన్నటికీ నెరవేరవు'' అంటూ అమిత్‌షా ధ్వజమెత్తారు. ''నిజమే. నల్లధనాన్ని వెనక్కి తెచ్చి ఒక్కొక్కరికి రూ.15 లక్షల చొప్పున పంచుతామంటూ పంచ రంగుల కలలు చూపిన వారిని ప్రజలు ఎప్పటికీ నమ్మరు'' అంటూ కేజ్రీవాల్ కౌంటర్ ఇచ్చారు. తన సొంత నియోజకవర్గం గాంధీనగర్‌లో మంగళవారం కొన్ని అభివృద్ధి ప్రాజెక్టులను అమిత్ షా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. గుజరాత్‌లో పర్యటిస్తున్న కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ ఓడిపోతోందని, కాంగ్రెస్ పనైపోయిందని జోస్యం చెప్పారు. తామొస్తే అవినీతి రహిత పరిపాలన అందిస్తామన్నారు.

ఏజీగా మళ్లీ ముకుల్ రోహత్గి

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి (67) మరోసారి అటార్నీ జనరల్‌గా నియమితులు కానున్నారు. ఆయన 2014–2017 మధ్య ఏజీగా చేశారు. అక్టోబరు 1 నుంచి రెండోసారి బాధ్యతలు చేపట్టనున్నారు. ఏజీ కేకే వేణుగోపాల్ పదవీ కాలం సెప్టెంబర్ 30తో ముగియనుంది.

స్కూలు బస్సులో చిన్నారిపై డ్రైవర్ అఘాయిత్యం

భోపాల్/రేవా: మూడున్నరేళ్ల చిన్నారిపై స్కూలు బస్ డ్రైవర్ అఘాయిత్యానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. భోపాల్‌లో ఈ నెల 8న ఈ దారుణం జరిగింది. నగరంలో పేరున్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో నర్సరీ చదివే చిన్నారి ఇంటికెళ్లాక ప్రైవేట్ భాగాల్లో నొప్పిగా ఉందని తల్లికి చెప్పింది. తల్లి ఆరాతీయడంతో జరిగిన దారుణం చెప్పింది. బాధిత చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్సు డ్రైవర్‌ను, ఘటన జరిగినపుడు బస్‌లో ఉన్న మహిళా హెల్పర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, పోక్సో సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కాగా డ్రైవర్ అక్రమంగా నిర్మించిన ఇంటిని అధికారులు కూల్చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు.

ఎ.రాజా వివాదాస్పద వ్యాఖ్యలు

చెన్నై: ''హిందువుగా ఉన్నంత వరకూ నువ్వు దళితునివే. అంటరానివాడివే. శూద్రునివే. శూద్రునిగా ఉన్నంతకాలం నువ్వు ఓ వేశ్య సంతానమే''అంటూ డీఎంకే నేత, కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా చేసిన వ్యాఖ్యలు వివాదం రేపుతున్నాయి. మంగళవారం చెన్నైలో పార్టీ భేటీలో ఆయన మాట్లాడుతూ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''మీలో ఎంతమంది వేశ్య సంతానంగా, అంటరానివారిగా మిగిలిపోవాలనుకుంటున్నారు? ఈ ప్రశ్నలపై గొంతెత్తినప్పుడు మాత్రమే సనాతన ధర్మాన్ని బద్దలుకొట్టే ఆయుధంగా మారగలం''అంటూ పిలుపునిచ్చారు. ''శూద్రులంటే హిందువులు కారా? వారిని మను స్మృతి తీవ్రంగా అవమానించింది. వారికి విద్య, ఉద్యోగ, సమానావకాశాలను, ఆలయాల్లోకి ప్రవేశాలను నిషేధించింది' అంటూ రాజా ప్రసంగించినట్టుగా చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది. ద్రవిడ ఉద్యమం 90 శాతం మంది హిందువులకు బాసటగా నిలిచిందంటూ అనంతరం రాజా ట్వీట్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది.

కోల్‌కతా రణరంగం

తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన బీజేపీ సచివాలయ ర్యాలీ

- పోలీసులతో కార్యకర్తల బాహాబాహీ
- ఇరువైపులా పలువురికి గాయాలు
- వాహనాలకు నిరసనకారుల నిప్పు
- సువేందు సహా పలువురి అరెస్టు
- రాష్ట్రంలో ఆటవిక రాజ్యం: బీజేపీ
- బీజేపీదే గూండాయిజం: తృణమూల్



బీజేపీ శ్రేణులపై వాటర్ క్యానన్లు, టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్న పోలీసులు



కాలిపోతున్న పోలీస్ వ్యాను

కోల్‌కతా: పశ్చిమబెంగాల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ అవినీతి, అక్రమాల్లో నిండా మునిగిందంటూ మంగళవారం బీజేపీ తలపెట్టిన 'చలో సెక్రటేరియట్' ర్యాలీ కోల్‌కతాతో పాటు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఘర్షణలకు, హింసకు దారి తీసింది. పోలీసులతో బీజేపీ కార్యకర్తలు బాహాబాహీ తలపడ్డారు. దాంతో రెండువైపులా చాలామంది గాయాల పాలయ్యారు. రాష్ట్ర నలుమూలల నుంచీ కార్యకర్తలు బీజేపీ ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్లలో కోల్‌కతా చేరుకున్నారు. నగరంలోనూ, శివార్లలోనూ పలుచోట్ల నిషేధాజ్ఞలను ఉల్లంఘించి బారికేడ్లను ఛేదించుకుని దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లు తదితరాలను ఉపయోగించారు. లాఠీలకూ పని చెప్పారు. దాంతో రెచ్చిపోయిన నిరసనకారులు సంత్రాగచ్చి, హౌరాతో పాటు నగరంలోని లాల్‌బజార్, ఎంజీ రోడ్, హౌరా తదితర చోట్ల పోలీసులపైకి రాళ్లు, ఇటుకలు, గ్లాస్ బాటిళ్లు రువ్వారు. చేతికందిన కర్రలు పట్టుకుని పోలీసులను తరిమికొట్టారు. పోలీసు వాహనాలకు నిప్పంటించారు. రాళ్ల దాడిలో రక్తమోడుతున్న పోలీసులు, వాటర్ క్యానన్లు, లాఠీచార్జీతో గాయపడ్డ నిరసనకారులతో ఆయా ప్రాంతాలు భీతావహంగా మారాయి. లాఠీ చార్జిలో మీనాదేవి, స్వపన్‌దాస్ గుప్తా తదితర బీజేపీ నేతలు కూడా గాయపడ్డట్టు సమాచారం.

పరస్పర ఆరోపణలు

పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందార్ వందలాది మంది నేతలు, కార్యకర్తలతో కలిసి హౌరాలో మైదాన్‌లో బైఠాయించారు. విపక్షాల ప్రజాస్వామిక హక్కులను సీఎం మమత పాశవికంగా హరిస్తున్నారంటూ దుయ్యబట్టారు. పోలీసుల్లో పలువురు సర్కారు తొత్తుల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విపక్ష నేత సువేందు అధికారి కూడా తమపట్ల పోలీసులు ఆటకవికంగా ప్రవర్తించారంటూ నిప్పులు చెరిగారు. ''నిరసన తెలిపేందుకు ఓ విపక్ష నేతకున్న హక్కుకు గౌరవమే లేకుండా పోయింది. ఓ మహిళా పోలీసు నన్ను ఏ విధంగా కొట్టిందీ అందరూ చూశారు'' అన్నారు. అయితే నిరసనకారుల్లో ఎవరికీ తీవ్ర గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. తమవైపు చాలామంది సిబ్బంది గాయపడ్డట్టు చెప్పారు. తృణమూల్ ఆటవిక పాలనపై తమ పోరు కొనసాగుతుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు దిలీప్ ఘోష్ అన్నారు. మమత సర్కారుకు రోజులు దగ్గర పడ్డాయంటూ నినాదాలతో నేతలు, కార్యకర్తలు హోరెత్తించారు. సువేందు, ఎంపీ లాకెట్ చటర్జీతో పాటు పలువురు బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘర్షణలతో నగరంలో సాధారణ జనజీవనం బాగా ప్రభావితమైంది. నిరసన ముసుగులో అల్లర్లకు బీజేపీ కుట్ర పన్నిందని తృణమూల్ అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ ఆరోపించారు. ''వాళ్లు గూండాల్లా ప్రవర్తించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, పోలీసులను గాయపరచడం, రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం ఏ రకమైన నిరసన? బీజేపీ తీరు సిగ్గుచేటు'' అంటూ దుమ్మెత్తిపోశారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల్లో... గేమ్ చేంజర్



క్యాన్సర్ ప్రాణాంతక రోగమని, మొదట్లోనే గుర్తించకుంటే బతకడం కష్టమని అందరికీ తెలుసు. కొన్నిసార్లు వ్యాధిని గుర్తించేలోగానే పరిస్థితి చేయి దాటిపోతుంది. కొన్నిరకాల క్యాన్సర్లను కనిపెట్టేందుకు పరీక్షలు కూడా లేవు. అయితే ఒకే ఒక రక్తపరీక్షతో చాలారకాల క్యాన్సర్లను ఇట్టే కనిపెట్టేయొచ్చంటే? హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంటాం కదా. సరిగ్గా అలాంటి మల్టీ క్యాన్సర్ అర్లీ డిటెక్షన్ (ఎంసీఈడీ) రక్తపరీక్షను సైంటిస్టులు కనిపెట్టేశారు. ఎలాంటి లక్షణాలూ కనిపించని క్యాన్సర్లను కూడా ఈ పరీక్ష ద్వారా నిర్ధారించగలగడం ఇందులో పెద్ద విశేషం. ఊపిరి పీల్చుకోదగ్గ విషయం కూడా!

ఒకరకంగా ఎంసీఈడీ పరీక్షను వైద్యశాస్త్రంలో, ముఖ్యంగా క్యాన్సర్ నిర్ధారణలో గేమ్ చేంజర్‌గా చెప్పొచ్చు. క్యాన్సర్ స్క్రీనింగ్‌లో కొత్త విధానాలను కనుగొనేందుకు కృషి చేస్తున్న గ్రెయిల్ అనే హెల్త్ కేర్ సంస్థ ఈ సరికొత్త పరీక్ష విధానాన్ని అభివృద్ధి చేసింది. అధ్యయనంలో భాగంగా ఈ సంస్థ 6,662 మంది వ్యక్తులపై ఈ పరీక్ష నిర్వహించింది. వీళ్లంతా 50, అంతకన్నా ఎక్కువ వయసు వ్యక్తులే కావడం గమనార్హం. ప్యారిస్‌లో ఇటీవల జరిగిన యూరోపియన్ సొసైటీ ఫర్ మెడికల్ అంకాలజీ (ఈస్ఎంఓ) కాంగ్రెస్‌లో గ్రెయిల్ తమ పరిశోధన వివరాలను సమర్పించింది. ఆరువేల పై చిలుకు మందిపై పరీక్ష నిర్వహిస్తే వారిలో దాదాపు ఒక శాతం మందికి క్యాన్సర్ ఉన్నట్టు తేలింది. వీటిలో కొన్ని ఇప్పటిదాకా పరీక్షలకు దొరకని క్యాన్సర్ రకాలు కూడా ఉండటం విశేషం. దీన్ని క్యాన్సర్ పరిశోధనలను సమూలంగా మార్చివేసే పరీక్ష విధానంగా భావిస్తున్నారు.

ఇప్పటిదాకా అందుబాటులో ఉన్న క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష అయిన గాలెరీ (ఎంసీఈడీ–ఈ)ని మరింతగా ఆధునీకరించి వ్యాధిని మరింత కచ్చితంగా గుర్తించేలా రూపొందించారు. గాలెరీ పరీక్ష ద్వారా పదుల సంఖ్యలో క్యాన్సర్లను గుర్తించే వీలుంది. వాటిలో లక్షణాలు కనపడని క్యాన్సర్లు కూడా ఉన్నాయి. అయితే ఎంసీఈడీ పరీక్ష పద్ధతిలో దాదాపు రెట్టింపు స్థాయిలో క్యాన్సర్లను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించే వీలుంది. గాలెరీ పరీక్ష ద్వారానే కాలేయం, చిన్న పేగు, యుటిరస్, పాంక్రియాటిక్ స్టేజ్–2, బోన్ క్యాన్సర్ వంటివాటిని లక్షణాలు లేని స్థాయిలోనే గుర్తించే వీలుంది. అయితే కొత్త పద్ధతి మరిన్ని రకాల క్యాన్సర్లను మరింత కచ్చితత్వంతో గుర్తిస్తుంది. కొత్త పరీక్ష (ఎంసీఈడీ)లో 92 మందిలో క్యాన్సర్ లక్షణాలను గుర్తించారు. పైగా 97 శాతం కచ్చితత్వముంది. ఇలా గుర్తించిన 36 రకాల క్యాన్సర్లలో 71 శాతం క్యాన్సర్లను నిర్ధారించే అవకాశం ఇప్పటిదాకా ఉండేది కాదు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడం వల్ల చికిత్సా విధానంలో కూడా పెను మార్పులు రానున్నాయి. అయితే ఇది క్లినికల్‌గా ఇంకా అందుబాటులోకి రావాల్సి ఉంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

బీజేపీది అశాంతివాదం: రాహుల్



రాహుల్‌తో కరచాలనం చేస్తున్న మహిళ

తిరువనంతపురం: హిందూత్వం ఓం శాంతి అని ప్రబోధిస్తే అధికార బీజేపీ మాత్రం దేశంలో అశాంతిని పెంచుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం కేరళలో భారత్ జోడో యాత్రలో కల్లంబలంలో భారీ జనసమూహాన్ని ఉద్దేశిస్తూ ఆయన ప్రసంగించారు. ''హిందూత్వంలో మనం మొట్టమొదటగా నేర్చుకునేది 'ఓం శాంతి' అనే రెండు పదాలే. అలాంటి శాంతియుత భారతావనిలో బీజేపీ అశాంతిని విస్తరింపజేస్తోంది. అశాంతిని పెంచే ఈ పార్టీ ఎలా హిందూత్వానికి ప్రతినిధిగా చలామణి అవుతుంది? రాజకీయంగా విద్వేషం రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలవవచ్చని బీజేపీ నిరూపించింది' అని దుయ్య బట్టారు. భారత్ జోడో యాత్రలో కదం తొక్కుతున్న తమ యాత్రకు పాదాలకు గాయాలు, బొబ్బలు ఆటంకం కాలేవని రాహుల్ అన్నారు. మంగళవారం జడివానలోనూ యాత్ర కొనసాగింది. వందలాది మంది మద్దతుదారులు రాహుల్‌తో కలిసి ముందుకు కదిలారు. 'దేశాన్ని ఐక్యం చేసే ఈ యాత్ర ఆగదు' అని వీడియోను రాహుల్ ఫేస్‌బుక్‌లో పోస్ట్‌చేశారు. 'భారత స్వప్నాన్ని ముక్కలుచేశారు. దాన్ని మేం ఒక్కటి చేస్తాం. ఆ ప్రయత్నంలో 100 కి.మీ. పూర్తయింది. ఇప్పుడే మేం మొదలుపెట్టాం' అంటూ ట్వీట్ చేశారు.

కోవిడ్ కట్టడిలో భారత్ భేష్

బిల్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ప్రశంస



న్యూఢిల్లీ: కరోనా వైరస్ కట్టడిలో విఫలమై ప్రపంచ దేశాలు అల్లాడుతుంటే కోవిడ్ సంక్షోభాన్ని భారత్ సమర్థవంతంగా ఎదుర్కొందని బిల్, మిలిందా గేట్స్ ఫౌండేషన్ ప్రశంసించింది. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఒక వేళ కోవిడ్ సమర్థ నిర్వహణ అంశం ఉండి ఉంటే భారత్ ఈ విషయంలో ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్‌ను పొంది ఉండేదని బిల్, మిలిందా గేట్స్ ఫౌండేషన్ సీఈఓ మార్క్ సుజ్‌మాన్ వ్యాఖ్యానించారు. ఫౌండేషన్ ఆరో వార్షిక లక్ష్య సాధకుల (గోల్‌కీపర్స్) నివేదిక విడుదల సందర్భంగా మంగళవారం ఆయన పీటీఐ వారాసంస్థతో మాట్లాడారు. ''దేశ సమస్యలను పరిష్కరించుకుంటూనే హఠాత్తుగా వచ్చిపడిన కోవిడ్ మహమ్మారి అదుపులో భారత్ విజయం సాధించింది. కోవిడ్ కట్టడికి అవలంబించిన విధానాలు, తీసుకున్న నిర్ణయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శనీయం. 200 కోట్ల కరోనా టీకాల పంపిణీ, ఏకంగా 90 శాతం వ్యాక్సినేషన్ రేటుతో ఎన్నో విషయాల్లో దిక్సూచీగా మారింది. దేశీయంగా టీకాలను ఉత్పత్తి చేయించి వ్యాక్సిన్ తయారీ రంగంలో పెద్దన్న పాత్ర కొనసాగిస్తోంది. వచ్చే ఏడాది జీ20 కూటమికి అధ్యక్ష బాధ్యతలు తీసుకుంటూ ఎన్నో అంతర్జాతీయ వేదికలపై భారత్ సత్తా చాటుతోంది. పేదరిక నిర్మూలన, నవజాత శిశు మరణాల రేటు తగ్గుదల వంటి అంశాల్లోనూ మంచి పురోగతి సాధించింది. కోవిన్ యాప్ ద్వారా త్వరితగతిన కోట్లాది వ్యాక్సిన్ల పంపిణీని సుసాధ్యం చేసింది. భారత్‌లో స్వయం ఉపాధి బృందాల ద్వారా మహిళలు సాధించిన సాధికారత, ప్రగతి అమోఘం' అని సుజ్‌మాన్ అన్నారు.

ఆక్సిజన్ కొరతతో కోవిడ్ మరణాలపై ఆడిట్

కరోనా రెండో వేవ్ సమయంలో ఆక్సిజన్ కొరతతో సంభవించిన మరణాలపై ఆడిట్ చేయించాలని పార్లమెంటరీ ప్యానెల్ కేంద్రానికి సిఫారసు చేసింది. ఆక్సిజన్ కొరతతో మరణాలు సంభవించాయన్న వాదనను ఆరోగ్య శాఖ కొట్టిపారేయడం దురదృష్టకరమని పేర్కొంది. బాధిత కుటుంబాలకు పరిహారమివ్వాలని పేర్కొంది. కమిటీ తన 137వ నివేదికను సోమవారం రాజ్యసభకు సమర్పించింది. కేసులు భారీగా పెరిగిపోవడంతో ఆరోగ్య మౌలిక వసతులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడిందని తెలిపింది. రాష్ట్రాలకు అవసరాలను అనుగుణంగా సిలిండర్లను పంపిణీ చేయలేక తీవ్ర సంక్షోభానికి కేంద్రం కారణమైందని తప్పుబట్టింది. క్యాన్సర్‌ను గుర్తించదగిన వ్యాధిగా పేర్కొనాలని మరో నివేదికలో కేంద్రానికి సూచించింది.

నేను దొంగల సర్దారును

నా శాఖ నిండా దొంగలే

- నాపైనా మరికొందరు సర్దార్లు
- బిహార్ వ్యవసాయ మంత్రి సుధాకర్‌సింగ్ సంచలన వ్యాఖ్యలు



పట్నా: బిహార్‌లో నితీశ్‌కుమార్ సర్కారును సొంత కేబినెట్ సహచరుడే ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టారు. తన శాఖ నిండా అవినీతిపరులేనంటూ సంకీర్ణ పక్షమైన ఆర్జేడీకి చెందిన వ్యవసాయ మంత్రి సుధాకర్‌సింగ్ (46) సంచలన వ్యాఖ్యలు చేశారు. ''నా శాఖ పూర్తిగా దొంగలతో నిండిపోయింది. వారిని చూస్తుంటే నేనో దొంగల సర్దారునని అనిపిస్తోంది'' అని రెండు రోజుల క్రితం ఓ బహిరంగ సమావేశంలో ప్రసంగిస్తూ ఆయనన్నారు. అంతటితో ఆగకుండా, ''నాపైన కూడా మరికొందరు దొంగల సర్దార్లున్నారు'' అంటూ అన్యాపదేశంగా ఆర్జేడీకి చెందిన డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, సీఎం నితీశ్‌లపైనా బాంబు పేల్చారు. పైగా, 'ప్రభుత్వమే దొంగలు, అవినీతిపరులతో నిండినప్పుడు ప్రజలు రోడ్డెక్కాల్సిందే'నంటూ రాం మనోహర్ లోహియా వ్యాఖ్యలను కూడా ఉటంకించారు! తాజాగా వైరలవుతున్న ఈ వ్యాఖ్యల తాలూకు వీడియో రాజకీయంగా ప్రకంపనలు రేపుతోంది. దీనిపై మీడియా మంగళవారం మంత్రిని వివరణ కోరగా తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ఆయన స్పష్టం చేయడం విశేషం. ''నన్ను ఎన్నుకున్న ప్రజల పట్ల విధేయునిగా ఉండాల్సిన బాధ్యత నాపై ఉంది. మొన్నటి నా వ్యాఖ్యలను వెనక్కు తీసుకునే ప్రస్తకే లేదు'' అంటూ కుండబద్దలు కొట్టారు. ఆర్జేడీతో కలిసి తమను అధికారానికి దూరం చేశారంటూ నితీశ్‌పై గుర్రుగా ఉన్న బీజేపీ దీన్ని రెండు చేతులా దొరకబుచ్చుకుంది. ''వ్యవసాయ మంత్రి వ్యాఖ్యలు కనువిప్పు. నితీశ్ పాలనలో బిహార్ నిండా అవినీతిలో కూరుకుపోయిందనేందుకు తిరుగులేని రుజువు'' అని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి నిఖిల్ ఆనంద్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అవినీతిపై తక్షణం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సుధాకర్‌సింగ్ తండ్రి జగదానంద్‌సింగ్ బిహార్ ఆర్జేడీ చీఫ్. పైగా తేజస్వికి బాగా సన్నిహితుడు. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలపై ఏమని స్పందించాలో ఎటూ పాలుపోక పాలక సంకీర్ణం జుత్తు పీక్కుంటోంది.

అందుబాటు ధరల్లోకి క్యాన్సర్ మందులు

- అత్యవసర ఔషధాల జాబితాలోకి మరో 34 డ్రగ్స్
- సవరించిన జాబితా విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: యాంటీ క్యాన్సర్ డ్రగ్స్, యాంటీ బయోటిక్స్ సహా 34 డ్రగ్స్‌ను జాతీయ అత్యావశ్యక ఔషధాల జాబితా(ఎన్ఎల్ఈఎం)లోకి కేంద్రం చేర్చింది. దాంతో వీటి ధరలు దిగిరానున్నాయి. ఈ మేరకు 384 జాతీయ అత్యవసర ఔషధాల జాబితాను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం విడుదల చేశారు. ఐవర్‌మెక్టిన్, అమికాసిన్, బెడాక్విలైన్, డెలామనిడ్, ముపిరోసిన్, మెరోపెనెమ్ వంటివి వీటిలో ఉన్నాయి. బెండామస్టీన్ హైడ్రోక్లోరైడ్, ఇరినోటికాన్ హెచ్‌సీఐ ట్రైహైడ్రేడ్, లెనాలిడోమైడ్, లియూప్రోలైడ్ ఎసిటేట్ వంటి యాంటీ క్యాన్సర్ డ్రగ్స్, నికోటిన్ రిప్లేస్‌మెంట్ థెరపీ, బుప్రినోర్ఫిన్ వంటి మానసిక చికిత్స ఔషధాలనూ జాబితాలో చేర్చారు. ర్యాంటిడిన్, సుక్రాల్ఫేట్, వైట్ పెట్రోలియం, ఎటినోలోల్, మెథైల్‌డోపా సహా 26 డ్రగ్స్‌ను తొలగించారు. 1996 నుంచి ఈ జాబితాను కేంద్రం అమలుచేస్తోంది. 2003, 2011, 2015ల్లో దీన్ని సవరించారు. ఆరోగ్య సంరక్షణలో అన్ని స్థాయిల్లోనూ సరసమైన, నాణ్యమైన ఔషధాల ప్రాధాన్యాన్ని నిర్ధారించడంలో ఎన్ఎల్ఈఎందే పెద్ద పాత్ర అని మంత్రి అన్నారు. ఎండోక్రైన్ మెడిసిన్, కాంట్రాసెప్టివ్స్ ఫ్లుడ్రోకార్టిసోన్, ఓర్మీలోక్సిఫీన్, ఇన్సులిన్ గ్లార్జైన్, టెనిలిగ్లిటిన్, శ్వాస వ్యవస్థ సంబంధ మోంటెలూకాస్ట్, నేత్ర సంబంధ లాటనోప్రోస్టలనూ జాబితాలో చేర్చారు.

నిరుద్యోగం పైపైకి

రాష్ట్రాల్లో భారీ వ్యత్యాసం • యువత, మహిళలపై తీవ్ర ప్రభావం




న్యూఢిల్లీ: దేశ ఆర్థికాభివృద్ధిలో బ్రిటన్‌ను దాటేశామని మీసాలు మెలేస్తున్నాం. కానీ ఉద్యోగాల కల్పనలో మాత్రం పరిస్థితి నానాటికి దిగజారుతోంది. గత ఏడాది కాలంలో నిరుద్యోగ రేటు పెరిగిపోతూ వస్తోంది. ఆగస్టులో నిరుద్యోగం రేటు ఏకంగా 8% శాతానికి చేరుకుంది. అయిదేళ్ల క్రితం 5% ఉన్న నిరుద్యోగ రేటు అలా అలా పెరుగుతూనే ఉంది. 2021 ఆగస్టులో నిరుద్యోగం రేటు రికార్డు స్థాయిలో 8.35%కి చేరుకుంది. ఈ ఏడాది జనవరి నాటికి 6.56 శాతానికి తగ్గినప్పటికీ మళ్లీ బాగా పెరిగిపోయిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఇక గ్రామీణ భారతంలో ఉద్యోగాలు లేక యువత విలవిలలాడిపోతున్నారు. గ్రామీణ భారత్‌లో నిరుద్యోగం రేటు 9.6% ఉంటే, పట్టణాల్లో 7.7%గా ఉంది.

రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం

రాష్ట్రాల వారీగా నిరుద్యోగ రేటులో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. 30% కంటే ఎక్కువగా నిరుద్యోగం రేటు ఉన్న రాష్ట్రాలు మూడు ఉంటే, 3%కంటే తక్కువ ఉన్న రాష్ట్రాలు నాలుగున్నాయి.

2022 నెలల వారీగా నిరుద్యోగం రేటు(శాతంలో)



నిరుద్యోగం అత్యధికంగా ఉన్న 5 రాష్ట్రాలు

హరియాణా	37.3%
జమ్మూ కశ్మీర్	32.8%
రాజస్తాన్	31.4%
జార్ఖండ్	17.3%
త్రిపుర	16.3%
తెలుగు రాష్ట్రాలు	
తెలంగాణ	6.9%
ఆంధ్రప్రదేశ్	6.0%

హరియాణాలో అత్యధికంగా 37.3 శాతంతో నిరుద్యోగంలో మొదటి స్థానంలో ఉంటే జమ్ము కశ్మీర్‌లో 32.8%, రాజస్థాన్‌లో 31.4% ఉంది. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణలో 6.9% నిరుద్యోగం రేటు ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో 6%గా ఉన్నట్టు సీఎంఐఈ వెల్లడించింది. ఛత్తీస్‌గఢ్‌లో నిరుద్యోగం రేటు అత్యల్పంగా 0.4% ఉంటే, 3శాతం కంటే తక్కువ ఉన్న రాష్ట్రాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, మేఘాలయా ఉన్నాయి.

40% మంది యువతకి ఉద్యోగాల్లేవ్

కొత్త ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. 2016–17 నుంచి 2021–22 గణాంకాలను పరిశీలించి చూస్తే ఉపాధి లేక మహిళలు, యువత ఎక్కువగా నష్టపోతున్నారు. గత ఏడేళ్ల కాలంలో యువతలో సగటు నిరుద్యోగం రేటు 42.6%గా ఉంది. ప్రస్తుతం యువతలో నిరుద్యోగం రేటు 34%గా ఉంది. ఇక పనిచేసే రంగంలో ఉండే మహిళలు పదేళ్ల క్రితం 26% ఉంటే ఇప్పుడు వారి సంఖ్య 19శాతానికి పడిపోవడం ఆందోళన కలిగించే అంశం. కరోనా మహమ్మారితో విలవిల్లాడుతూ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న భారత్‌లో నిరుద్యోగం పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది విద్యలో నాణ్యత ప్రమాణాలు తగ్గడం, యువతలో నైపుణ్యాలు కరువు, పనిచేసే ప్రాంతాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అత్యధికంగా వినియోగించడం వంటివన్నీ నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్నాయి. మరికొంత మంది యువత చిన్నా చితక ఉద్యోగాలు చేయలేక వదులుకొని వెళ్లిపోవడం కూడా నిరుద్యోగం పెరిగిపోవడానికి కారణంగా మారింది.

ప్రభుత్వం ఏం చేస్తోంది ?

నిరుద్యోగం కట్టడికి కేంద్ర ప్రభుత్వం 2023 చివరి నాటికి ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. రక్షణ రంగంలో నాలుగేళ్ల పాటు కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేయడానికి ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకం నిరుద్యోగాన్ని కట్టడి చేయడానికేనని ప్రభుత్వం చెబుతోంది. నాలుగేళ్ల తర్వాత ప్రైవేటు రంగంలో పని చేయడానికి నిపుణులైన కార్మికులు లభిస్తారన్నది కేంద్రం వాదనగా ఉంది. రవాణా రంగంలో ఊబర్, ఓలా, ఆతిథ్య రంగంలో ఇంటికి ఫుడ్ డెలివరీ చేసే స్విగ్గి, జోమాటో సర్వీసులతో లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినప్పటికీ తయారీ రంగం, మౌలికసదుపాయాల కల్పన ద్వారా ఉపాధి అవకాశాల్ని పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

మానవాళి మేలుకు దివ్యఖురాన్ సందేశం

సాక్షి, అమరావతి: ప్రపంచ మానవాళి మేలుకు దివ్య ఖురాన్ సందేశం అవసరమని ఏపీ స్టేట్ మైనార్టీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహమ్మద్‌ఖాన్ చెప్పారు. యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఖురాన్ స్టడీస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న విజయవాడలో నిర్వహించనున్న 8వ రాష్ట్ర బాలబాలికల ఖురానిక్ కంఠస్థ ప్రతిభా పోటీల పోస్టర్‌ను తన కార్యాలయంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానవాళి మనుగడ సక్రమంగా కొనసాగించేందుకు దిశా నిర్దేశం చేసే అనేక అంశాల సమాహారమే పవిత్ర ఖురాన్ గ్రంథమని చెప్పారు. మానవుల్లో జీవత్వం పెంపొందించేందుకు ఖురాన్‌లోని అనేక విషయాలు దోహదం చేస్తాయన్నారు. యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఖురానిక్ స్టడీస్ నిర్వాహకులు మహమ్మద్ దావుద్ పాల్గొన్నారు.

26 నుంచి విజయదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో 26వ తేదీ నుంచి దసరా మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి పేర్కొన్నారు.దశమి రోజు రాత్రి 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో శమీపూజ నిర్వహిస్తారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

భవానీపురం(విజయవాడ పశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ ఎన్టీఆర్ మార్గం ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా బుధవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నూజివీడు పంపింగ్ స్కీం ఏరియా, కమ్యూనిటీ హాల్ ఏరియా, ఆర్‌సీఎం చర్చి ఏరియా, మైలురాయి సెంటర్ ఏరియా, పంట కాల్వ రోడ్, శ్రీనివాసనగర్, సిద్ధార్థనగర్‌లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): భర్త వేధింపులపై భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన షేక్ జహర్‌కు అబ్దుల్ రజాక్‌తో ఈ ఏడాది మేలో వివాహం జరిగింది. ఇద్దరికీ రెండో వివాహం కాగా నెల రోజుల నుంచి అబ్దుల్ రజాక్ భార్యను వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

మహిళ అదృశ్యం

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): మహిళ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట నైజాంగేటుకు చెందిన రామకురి అరుణకుమారి బెంగుళూరులో జీఎస్‌ఎం నర్సుగా ఉద్యోగం చేస్తున్నారు. పదిహేను రోజుల క్రితం అరుణకుమారి సెలవుపై నగరానికి వచ్చారు. ఇటీవల అరుణకుమారికి ఇంట్లో వారు పెళ్లి సంబంధాలు చూస్తుండగా, ఆమె మరో వ్యక్తిని ప్రేమిస్తున్నట్లు చెప్పింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను మందలించారు. దీంతో మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అరుణకుమారి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన అరుణకుమారి వదిన జయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆటో చోరీ

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): ఇంటి ముందు నిలిపిన ఆటో చోరీకి గురైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దీనిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహతీపురానికి చెందిన వల్లెపు కామేశ్వరరావు ఆటో నడుపుతుంటాడు. ఈ నెల 9వ తేదీ రాత్రి కిరాయి చూసుకుని ఇంటికి వచ్చిన కామేశ్వరరావు తన ఆటోను ఇంటి ఎదుట నిలిపాడు. తెల్లవారి చూసేసరికి ఇంటి ముందు పెట్టిన ఆటో కనిపించలేదు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాగా చదువుకో..



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును కలెక్టరేట్‌లో మంగళవారం.. జి.కొండూరు నుంచి వచ్చిన తండ్రి, కుమారుడు కలిశారు. తమకు వైద్యం, ఆర్థికసాయం చేయాలని ఆ తండ్రి కోరగా అతన్ని చికిత్స కోసం జీజీహెచ్‌లో చేర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆ పిల్లవాడితో బాగా చదువుకోవాలని చెప్పి.. అతని విద్యకు ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయవాడ

సంక్షేమ పథకాలతో సామాజిక వికాసం

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మేయర్ రాయన భాగ్యలక్ష్మి
- 53వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ అప్పాజీరావు తదితరులు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): సంక్షేమ పథకాల అమలుతో సామాజిక వికాసానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా 53వ డివిజన్లోని 179వ సచివాలయం పరిధిలో పర్యటించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు బృందం ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గణపతిరావు రోడ్డు చేపలమార్కెట్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఎమ్మెల్యే పర్యటన నెహ్రూబొమ్మ సెంటర్, కేటీ రోడ్డు, పంచముఖ ఆంజనేయస్వామి గుడి, దూది ఫ్యాక్టరీ వీధి, బూరాడవారి వీధి, చేపల మార్కెట్ మీదుగా ముందుకు సాగింది. స్థానికులు సంక్షేమ పథకాల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వెలంపల్లి శ్రీనివాసరావుకు, సీఎం జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మొదటి తేదీనే పెన్షన్ వస్తోంటూ ఆనందంగా వ్యక్తం చేసి ధన్యవాదాలు తెలిపారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా.. అర్హతలుంటే సంక్షేమ పథకాలు అందించాలని జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. ఆ క్రమంలో జనసేన నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసిన అభ్యర్థుల ఇంట కూడా పథకాలను అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని కొనియాడారు. అంత చిత్తశుద్ధితో తమ ప్రభుత్వం పని చేస్తోందని వివరించారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యతో ఎవరికైనా పథకం ఆగితే వెంటనే సచివాలయం సిబ్బంది దాన్ని పరిశీలించి వచ్చే విధంగా చూస్తున్నారన్నారు. ఏ ప్రభుత్వ పథకమైనా అర్హత ఉండి రానివారు ఉంటే గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా కలిసి వారికి ఆ పథకం అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. 53వ డివిజన్‌లో సంక్షేమ పథకాల అమలు తీరుపై స్థానిక ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున సంతృప్తి వ్యక్తమవుతుంటే ఎల్లో మీడియా పదేపదే ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతోందని దుయ్యబట్టారు. నిందలు మోపుతూ అదే పనిగా తప్పుడు వార్తలు రాస్తున్నారని దుయ్యబట్టారు. వారి రాతలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అప్పాజీరావు, స్థానిక డివిజన్ అధ్యక్షుడు గురుమహంతు మహేష్, నాయకులు అక్రమ్, చాన్‌బాషా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల మంజూరుకు చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్

పాయకాపురం(విజయవాడరూరల్):పాకిస్తాన్ కాలనీ, బర్మాకాలనీల్లో నివసిస్తూ ఇళ్ల పట్టాలు లేని వారికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వడానికి రంగం సిద్ధం చేసింది. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ (ఎన్టీఆర్‌జిల్లా) శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ అధికారులతో కలిసి మంగళవారం 62వ డివిజన్ పాకిస్తాన్ కాలనీ, బర్మాకాలనీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. వారు ఆ కాలనీల్లో ఇంటింటికీతిరిగి ఇంటి స్థలాల పట్టాలు గానీ, కన్వెన్షియన్ల డీడ్స్‌గానీ, ఇతర ఆధార పత్రాలపై విచారించి తెలుసుకున్నారు. వీటి కోసం టీమ్స్‌ను ఏర్పాటు చేసి పూర్తి వివరాలను సేకరించాలని ఆదేశించారు. అనంతరం వీఎంసీ కమిషనర్ ఆ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని పరిశీలించి స్థానికులను విచారించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులతో పాటు పర్యటనలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులపై కుమారుడి దాడి

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): తల్లిదండ్రులపై దాడికి పాల్పడిన కుమారుడిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంసాలిపేట జెండాచెట్టుకు చెందిన బాపట్ల పార్వతి, జాన్ భార్యభర్తలు. పార్వతికి గతంలో వివాహమవ్వగా అప్పుడు ఆమెకు ముగ్గురు సంతానం. రెండో వివాహ ద్వారా ఇద్దరు సంతానం ఉన్నారు. చిన్న కుమారుడు నరేష్ పార్వతి ఇంటి దగ్గరలోనే ఉంటాడు. సోమవారం మధ్యాహ్నం తల్లి వద్దకు వచ్చిన నరేష్ ఆమెను తాడేపల్లి వెళ్లదామని కోరాడు. ఆమె నిరాకరించడంతో ఆగ్రహించిన అతను రాయితో కొట్టాడు. అదే సమయంలో జాన్ అడ్డు రాగా రోకలి బండతో కాలిపై కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ తదితరులు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను అమలు చేయనున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ నగర ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వెనుకబడిన వర్గాలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూసిందని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి పాలనాధికారంలో భాగస్వామ్యం కల్పించామని, ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి పథకాన్నీ అమలు చేస్తూ 99.44 శాతం హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని స్పష్టంచేశారు. గతంలో ఎన్నిలకు ముందు మాత్రమే దుల్హన్ పథకం ప్రకటించి ఆ తరువాత చేతులెత్తేసి మైనార్టీలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని దుయ్యబట్టారు. కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా గతంలో ఇచ్చిన ఆర్థిక సాయం కంటే రెట్టింపు ఎక్కువ ఇచ్చేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని వివరించారు. ముస్లిం మైనార్టీల పేద యువతుల వివాహానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించే షాదీ తోఫా పథకాన్ని ప్రకటించిన జగనన్న మైనార్టీల పక్షపాతిగా నిలిచారని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. ముస్లిం సబ్‌ప్లాన్, ఉర్దూను సెకండ్ లాంగ్వేజ్‌గా చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే సాధ్యమైందన్నారు. ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పి.గౌతంరెడ్డి మాట్లాడుతూ.. కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను ప్రకటించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దమ్మున్న నాయకుడిగా మరోమారు నిరూపించుకున్నారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించిన రూ.లక్షల నిధులను చంద్రబాబు నేరుగా తినేశాడని విమర్శించారు. తొలుత వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పి.గౌతంరెడ్డి తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు బూదాల శ్రీనివాస్ నిర్వహించిన కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, కార్పొరేటర్ బాలి గోవింద్, ఎస్సీ నాయకులు లేళ్లపూడి లాజర్, తోకల శ్యామ్, నలకుర్తి రమేష్, కె.కృపాలక్ష్మి, దాసి జయప్రకాష్ కెనడి, పోలిమెట్ల శరత్‌బాబు, కామళ్ల జోజి, గుండె సుందర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు షాదీ తోఫా, వైఎస్సార్ కల్యాణమస్తు ప్రకటించడంపై 42వ డివిజన్ కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. డివిజన్‌లో మంగళవారం ముస్లిం మైనార్టీ మహిళలతో కలిసి సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. చైతన్యరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే తప్పక నెరవేరుస్తారన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేశారన్నారు. గత పాలకులు ఎన్నికల ముందే నామమాత్రంగా తోఫాలు, పెళ్లి కానుక ఇచ్చాయన్నారు. దరిదాపుల్లో ఎన్నికలు లేకపోయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు కల్యాణమస్తు, తోఫా ప్రకటించారన్నారు. ఆయా వర్గాల తరఫున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలి

వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆమె స్వచ్ఛభారత్ మిషన్ 2.0 సంబంధించి ప్రచారం కోసం ప్రణాళికాబద్ధంగా వీఎంసీ రెండు ప్రాంతాల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ ఎనిమిదేళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేశవ్యాప్తంగా సేవా దివస్ నిర్వహిస్తోందని, పక్షం రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛామృత్ మహోత్సవ్‌ను కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో నగరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ఈ నెల 17వ తేదీన వివిధ నగరాల్లో ఇండియన్ స్వచ్ఛతా లీగ్ పోటీల్లో వీఎంసీ కూడా పాల్గొంటుందని, దేశవ్యాపంగా 1850 నగరాలు పోటీపడుతున్నాయని, అందులో భాగంగా తొలివిడతగా చెత్తలేని బీచ్‌లు, కొండలు, పర్యాటక ప్రదేశాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ మేరకు భవానీ ఐలాండ్ బోటింగ్ పాయింట్, రామలింగేశ్వర నగర్ రివర్‌పాయింట్ వద్ద చెత్త రహిత నగరంగా యువత చైతన్యవంతం అయ్యేలా ర్యాలీలు నిర్వహించాలని, ఈ ప్రాంగణాల్లో పరిశుభ్రతతో పాటు ఆర్ట్ వర్క్, మొక్కలు నాటాలని సూచించారు.

యువతలో ఉత్సాహాన్ని రేకెత్తించడం కోసం స్టార్ట్ అప్ చాలెంజ్ ఫోరం, టాయ్ క్యాథాన్(వ్యర్థాల నుంచి బొమ్మలు చేయటం), టెక్నాలజీ ఎగ్జిబిషన్, పోర్టర్ నమోదు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర యువత స్వచ్ఛందంగా ఇన్నోవేటివ్ ఇండియాడాట్‌మైజీవోవీడాట్‌ఇన్‌స్వచ్ఛ్‌యూత్‌ర్యాలీడాట్‌కాంలో నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సీఎంవోహెచ్ డాక్టర్ రత్నావళి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎ.రవిచంద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ టి.కె.రాణా

విజయవాడ స్పోర్ట్స్: విధుల్లో అప్రమత్తంగా ఉంటూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని పోలీస్ కమిషనర్ టి.కె.రాణా సూచించారు. విజయవాడ పశ్చిమ పోలీస్ డివిజన్‌లోని మహిళా పోలీసులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. స్థానిక పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీ రాణా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మిస్సింగ్ కేసుల దర్యాప్తులో చురుగ్గా వ్యవహరించి దర్యాప్తు అధికారికి సహకరించాలన్నారు. దిశా యాప్ పట్ల మహిళలకు నిరంతరం అవగాహన కల్పిస్తుండాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యాసంస్థలను పరిశీలిస్తూ విద్యార్థినిలుకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలని, పోక్సో చట్టాన్ని వివరించాలన్నారు. మత్తుకు బానిసైన యువతను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని కోరారు. ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ అధికారులతో సమన్వయం ఏర్పరచుకుని బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకారం ఏ మేరకు అందుతుందో గుర్తించాలని తెలిపారు. స్కూల్‌కు వెళ్లని విద్యార్థులు తారస పడితే వెంటనే వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి స్కూల్ డ్రాపవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే స్టేషన్ అధికారికి సమాచారం ఇవ్వాలన్నారు. నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రజలతో స్నేహభావంతో మెలుగుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డీసీపీ విశాల్‌గున్ని, ఏడీసీపీలు పి.వెంకటరత్నం, కొల్లి శ్రీనివాసరావు, ఏసీపీలు డాక్టర్ కె.హనుమంతరావు, డాక్టర్ బి.రవికిరణ్, సీఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోండి



పోలీస్ కమిషనర్ టి.కె.రాణాకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు

విజయవాడ స్పోర్ట్స్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నానిని అసభ్య పదజాలంతో దూషిస్తున్న టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు కోరారు. పోలీస్ కమిషనర్ టి.కె.రాణాకు వారు మంగళవారం వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు దేవినేని ఉమా, బుద్దా వెంకన్న, దూళిపాళ్ల నరేంద్ర, వర్ల రామయ్య, పలు పత్రికలు, టీవీలతో పాటు సోషల్ మీడియా వేదికగా వైఎస్సార్ సీపీ నాయకులను దూషిస్తున్నట్లు పోలీస్ కమిషనర్‌కు వివరించారు. వీరితో పాటు మహా టీవీ ఎండీ మార్ల్ల వంశీ తన చానల్‌లో ప్రభుత్వంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్నారు. వీరి నిర్వాకంతో రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు.

అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా పాలనను అస్థిర పరచడానికి కుట్ర చేస్తున్న టీడీపీ నాయకులు, మహా టీవీ ఎండీపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సీపీ రాణాకు వినతిపత్రం ఇచ్చిన వారిలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు దాసి జయప్రకాష్‌కెనడి, తోకల శ్యామ్, ఉమ్మడి ధనరాజ్, పొలిమెట్ల శరత్‌బాబు, బూదాల శ్రీనివాసరావు, మంచాల రమేష్, నలకుర్తి రమేష్, లేళ్లపూడి లాజర్, కామళ్ల కోటేశ్వరరావు, మద్దిరాల కమలాకర్, సీహెచ్ విజయ్ ఉన్నారు.

బ్యాడ్మింటన్‌లో చరిష్మా సత్తా



సూర్య చరిష్మాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 8 నుంచి 11 వరకూ శ్రీకాకుళంలో జరిగిన ఏపీ స్టేట్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ అండర్ 17 బాలికల సింగిల్స్ విభాగంలో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని టి.సూర్యచరిష్మా విన్నర్‌గా నిలిచింది. కొచ్చిన్‌లో ఈ నెల 5 నుంచి 8 వరకూ జరిగిన ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ 2022లో జూనియర్ టీమ్ అండర్ -19 విభాగంలో ద్వితీయ స్థానం, సీనియర్ టీమ్ విభాగంలో ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకుంది. తమ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న సూర్యచరిష్మా బ్యాడ్మింటన్‌లో సత్తా చాటడంపై ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ అభినందనలు తెలిపారు. ఆమెతో పాటు, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, సహచర విద్యార్థినులు అభినందించారు.

ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



హేతువాదం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ సమరం, రచయిత కృష్ణయ్య తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మానసిక వత్తిడి, భయం, అజ్ఞానం, అవిద్య మూఢనమ్మకాలను, అంధ విశ్వాసాలను పెంపొందిస్తాయని డాక్టర్ జి.సమరం అన్నారు. ఇది వ్యక్తుల అభివృద్ధికి, సమాజాభివృద్ధికి ఆటంకమన్నారు. ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి జీవీ కృష్ణయ్య రచించిన హేతువాదం పుస్తకాన్ని మంగళవారం డాక్టర్ జి.సమరం ఆవిష్కరించారు. రచయిత కృష్ణయ్య మాట్లాడుతూ హేతువాద ఆలోచన వివేకాన్ని, విచక్షణను, ఇంగిత జ్ఞానాన్ని పెంపొందిస్తుందన్నారు. తద్వారా సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు, సామాజిక రుగ్మతలతో దోపిడీకి గురికాని సమాజాన్ని నిర్మించవచ్చునన్నారు. కార్యక్రమంలో విశ్వం సంస్థ ప్రతినిధి మెజీషియన్ ఆదినారాయణ, సైకాలజిస్ట్ డాక్టర్ రమాదేవి, హరి సుబ్రహ్మణ్యం, డి.లక్ష్మీపద్మజ, నియంత తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



సచివాలయంలో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్

పటమట(విజయవాడ తూర్పు): సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలను ఇబ్బందిపెట్టేలా ప్రవర్తించకూడదని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్‌కుమార్ అన్నారు. నగర పర్యటనలో భాగంగా మంగళవారం వీరిద్దరూ 32వ డివిజన్ పరిధిలోని కేదారేశ్వరరావుపేట, బాప్టిస్ట్‌పాలెంలో ఉన్న 219 సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మూమెంట్ రిజిస్టర్, పెన్షన్ వివరాలు, ప్రజల నుంచి వచ్చిన అర్జీలు నమోదు రికార్డులను తనిఖీ చేశారు.

సచివాలయంలో విధిగా ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పోస్టర్లు, అర్హుల జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతగా వారికి కేటాయించిన విధులను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని, ప్రజలకు దగ్గరగా ఉంటూ మెరుగైన సేవలు అందించినప్పుడే సచివాలయాల ఏర్పాటు ఉద్దేశం నెరవేరినట్లని తెలిపారు. పర్యటనలో సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, జోనల్ కమిషనర్-1 సుధాకర్, ఈఈ నారాయణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్యామలాంబకు ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): దావుబుచ్చయ్యకాలనీలోని శ్రీ శ్యామలాంబ దేవి దేవాలయంలో మంగళవారం విశేషంగా కుంకుమార్చనలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రీతికరమైన శ్రీచక్రార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం లచన్ ఇన్‌ఫ్రా మహిళా భక్తబృందం సభ్యులు లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ఆయుష్‌లో యోగా శిక్షకుల పేరుతో తప్పుడు ప్రచారం

ఆయుష్ కమిషనర్ సూచన

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఆయుష్ విభాగంలో పార్ట్‌టైమ్ యోగా శిక్షకులను నియమిస్తున్నట్టు జరుగుతున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని ఆయుష్ కమిషనర్ రాములు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. యోగా శిక్షకులను తాత్కాలికంగా తీసుకుని భవిష్యత్‌లో వారి సేవలను క్రమబద్ధీకరిస్తారంటూ కొందరు ప్రచారం చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయుష్ విభాగంలో నియామకాలకు సంబంధించి తాము ఏ ఏజెన్సీకి అధికారం ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఆయుష్ పేరుతో ఏజెన్సీలు చేపట్టే తప్పుడు నియామక ప్రక్రియలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

వైద్య విధాన పరిషత్‌లో పలు కేడర్లలో మార్పులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖను బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వం ఏపీ వైద్య విధాన పరిషత్ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పలు పోస్టుల కేడర్‌ను మారుస్తూ ఇటీవల కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి మంగళవారం వైద్య శాఖ సవరించిన ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ మేరకు 91 డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టుల కేడర్‌ను సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారు. మరో 169 డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులను (168 సీఏఎస్ స్పెషలిస్ట్, ఒక సీఏఎస్ జనరల్) సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల కేడర్‌కు తగ్గించారు. మరో 11 సీఎస్-ఆర్ఎంవోలు, 42 సీఎస్-డెంటల్ పోస్టులను సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులుగా మార్చారు. 25 సీనియర్ అసిస్టెంట్ పోస్టులను ఆఫీస్ సూపరింటెండెంట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు.

విశాఖను పాలన రాజధానిగా చేసి తీరతాం

• వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, అనకాపల్లి: న్యాయపరమైన చిక్కులు తొలగిన వెంటనే విశాఖను పరిపాలన రాజధాని చేసి తీరతామని ఉమ్మడి విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ప్రాంతాల మధ్య విద్వేషాలు సృష్టించేందుకే అమరావతి పేరిట చంద్రబాబు పాదయాత్ర చేస్తున్నారని పేర్కొన్నారు. దీనికి ఉత్తరాంధ్ర ప్రజలంతా శాంతియుతంగా నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. అనకాపల్లిలో మంగళవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు దుష్టచతుష్టయంతో కలిసి మూడు రాజధానులపై వాస్తవాలను అవాస్తవాలుగా చూపించేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అంతకుముందు ఆయన పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గాజువాకలోని నడుపూరులో జగనన్న కాలని భూమిపూజలో పాల్గొన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి, విశాఖ జిల్లాల పార్టీ అధ్యక్షులు కరణం ధర్మశ్రీ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ భీశెట్టి సత్యవతి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్యేలు గొల్ల బాబురావు, పెట్ల ఉమాశంకర్‌గణేష్, కన్నబాబురాజు, విశాఖ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎస్.సుధాకర్ పాల్గొన్నారు.

జన అజెండా

రేపటి నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా శాసన సభలో విస్తృతంగా చర్చించేందుకు అధికార పక్షం సన్నద్ధమవుతోంది. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తూ దుష్ట చతుష్టయం చేస్తున్న దుష్ప్రచారాన్ని చట్టసభల వేదికగా తిప్పికొట్టి నిజానిజాలను ప్రజలకు వివరించనుంది. గురువారం ఉదయం 9 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండగా 10 గంటలకు శాసన మండలి సమావేశాలు మొదలవుతాయి. అసెంబ్లీ, మండలి సమావేశాలు ఐదు రోజుల పాటు జరిగే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం. శనివారం, ఆదివారం సమావేశాలకు సెలవు ఉంటుంది. తిరిగి సోమవారం నుంచి బుధవారం వరకు సమావేశాలు జరిగే అవకాశం ఉంది. శాసన సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) భేటీలో సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు.

▲ అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా చట్టసభల్లో చర్చించేందుకు అధికార పక్షం సర్వ సన్నద్ధమైంది. పాలనా వికేంద్రీకరణలో భాగంగా మూడు ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ఇప్పటికే ప్రకటించిన మేరకు అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని అధికార పక్షం నిర్ణయించింది. కొత్త జిల్లాల ఏర్పాటు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పాలనా వికేంద్రీకరణకు తీసుకున్న చర్యలు, ఇప్పటికే చేపట్టిన పరిపాలన సంస్కరణలపై విస్తృతంగా చర్చించేందుకు సిద్ధమవుతోంది.

▲ ప్రజలకు తప్పుడు సమాచారాన్ని చేరవేయడంతోపాటు రాష్ట్ర ప్రతిష్టను దిగజారుస్తూ పదేపదే అప్పులపై దుష్ట చతుష్టయం చేస్తున్న దుష్ప్రచారాన్ని అసెంబ్లీ వేదికగా గట్టిగా తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని అధికార పక్షం నిర్ణయించింది. అప్పులతో పాటు పారిశ్రామిక పెట్టుబడులపై కూడా దుష్టచతుష్టయం విషం చిమ్ముతోంది. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులపై జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చిన పారిశ్రామిక పెట్టుబడులతో పాటు రానున్న పెట్టుబడుల వివరాలను కూడా అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేయాలని అధికార పక్షం నిర్ణయించింది. మరో పక్క కోవిడ్ సంక్షోభం లోనూ దేశంలోనే అత్యధికంగా రాష్ట్రం రెండంకెల వృద్ధిని గత ఆర్థిక ఏడాదిలో సాధించింది. మిగతా రాష్ట్రాల కంటే మిన్నగా అత్యధిక వృద్ధి సాధించడానికి తీసుకున్న చర్యలను అసెంబ్లీ ద్వారా ప్రజలకు వివరించనుంది.

▲ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్య, వైద్య రంగాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వ రంగ విద్యా సంస్థలను బలోపేతం చేయడం ద్వారా నాణ్యమైన బోధనతో పేద, సామాన్య వర్గాల పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా తీసుకుంటున్న చర్యలను అసెంబ్లీ వేదికగా అధికార పక్షం వివరించనుంది. ప్రభుత్వ ఆస్పత్రులకు జవసత్వాలు కల్పించి అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దడంతోపాటు ఏకంగా 16 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని చేపట్టడం, హెల్త్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా గ్రామాల్లోనే ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేలా చేపట్టిన చర్యలను అసెంబ్లీ ద్వారా తెలియచేయనుంది.

▲ మహిళా సాధికారికతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. మహిళలు, పిల్లల భద్రతకు పలు చర్యలను తీసుకుంది. ఇటీవల నేషనల్ క్రైం బ్యూరో నివేదిక కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా నేరాలు తగ్గిన విషయాన్ని తెలియజేసింది. ఈ అంశాలను అసెంబ్లీలో చర్చించి ప్రజలకు తెలియజేయాలని అధికారపక్షం నిర్ణయించింది.

▲ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా చేకూర్చిన న్యాయంపై అసెంబ్లీలో చర్చించాలని అధికార పక్షం నిర్ణయించింది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తీరుతో పాటు నేరుగా నగదు బదిలీ ద్వారా పారదర్శకంగా చేకూర్చిన లబ్ధిపై అసెంబ్లీల్లో చర్చించి వివరించనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 30 లక్షల మందికిపైగా పేద మహిళలకు వారి పేరిటే ఇళ్ల స్థలాలను ఇవ్వడమే కాకుండా గృహ నిర్మాణాలను కూడా ప్రభుత్వం చేపట్టింది. ఈ అంశంపైన అసెంబ్లీలో చర్చించాలని అధికార పక్షం నిర్ణయించింది.

▲ పోలవరంపై గత ప్రభుత్వ నిర్వాకాలను చట్టసభల వేదికగా బహిర్గతం చేయడంతోపాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసేలా తీసుకుంటున్న చర్యల గురించి అసెంబ్లీలో చర్చించాలని అధికార పక్షం నిర్ణయించింది. మద్యం, ఇసుకపై దుష్ట చతుష్టయం దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి వాస్తవాలను అసెంబ్లీ వేదికగా ప్రజలకు వివరించనుంది.

అది ప్రభుత్వ విధాన నిర్ణయం

• నంద్యాల జిల్లాకు ఉయ్యాలవాడ పేరు పెట్టాలన్న పిల్ కొట్టివేత

సాక్షి, అమరావతి : జిల్లాకు ఏ పేరు పెట్టాలన్నది ప్రభుత్వ విధాన నిర్ణయమని హైకోర్టు తేల్చి చెప్పింది. జిల్లాకు ఫలానా వ్యక్తి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని ఆదేశించడం న్యాయస్థానం పని కాదని స్పష్టం చేసింది. కొత్తగా ఏర్పాటైన నంద్యాల జిల్లాకు ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి పేరు పెట్టేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సామాజిక కార్యకర్త కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్‌ను) హైకోర్టు మంగళవారం కొట్టేసింది. ఏదైనా జిల్లాకు లేదా పట్టణానికి రాజకీయ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, యోగి, ఇతర ప్రఖ్యాత వ్యక్తి పేరు పెట్టడం పూర్తిగా ప్రభుత్వ పరిధిలోనిదని స్పష్టంచేసింది. ఒకవేళ కోర్టు అలాంటి ఆదేశం ఇవ్వాలంటే, రాష్ట్ర ప్రభుత్వం చట్ట ఉల్లంఘనకు లేదా ప్రజల చట్టబద్ధ హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లు పిటిషనర్ నిరూపించాల్సి ఉంటుందని తెలిపింది. జిల్లాలకు పేరు పెట్టే విషయంలో నిర్దిష్ట ప్రమాణాలతో కూడిన చట్టం ఏదీ లేదని చెప్పింది. కాబట్టి ఈ వ్యాజ్యాన్ని కొట్టేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీవీఎస్ సోమయాజులు ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది.

కరకట్ట ఆక్రమణలైనా కూల్చాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల సంగతి తేలుస్తామన్న హైకోర్టు.. ఈ వ్యవహారాన్ని సుమోటో పిల్‌గా మలిచిన విషయం తెలిసిందే. ఈ తరహా ఆక్రమణలన్నింటిపై దాఖలైన వ్యాజ్యాలన్నింటినీ ఈ సుమోటో పిల్‌కు జత చేసిన ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం.. వీటిపై మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ, కృష్ణానది పరీవాహక ప్రాంతాన్ని ఆక్రమించుకుని కరకట్ట వద్ద నిర్మాణాలు చేపట్టారని, వాటికి సంబంధించిన వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఆ నిర్మాణాల సంగతి కూడా చూస్తామని, తమకు ఎవరైనా ఒకటేనని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ న్యాయవాది (రెవెన్యూ) పోతిరెడ్డి సుభాష్ రెడ్డి స్పందిస్తూ, ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని 30-40 ఏళ్ల క్రితమే చేపట్టిన నిర్మాణాల సంగతి ఏమిటని అడిగారు. అలాంటి నిర్మాణాలను సైతం కూల్చి వేయాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. అన్ని వ్యాజ్యాల్లో ఉమ్మడి ఉత్తర్వులు జారీ చేస్తామంది. ఆక్రమణదారులను ఖాళీ చేయించాల్సిందేనని, ప్రభుత్వం తీసుకొచ్చిన క్రమబద్ధీకరణ పథకం ద్వారా క్రమబద్ధీకరణ చేసుకున్న వారు మినహా ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న మిగిలిన వారంతా ఖాళీ చేయాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ సమయంలో న్యాయవాది యలమంజుల బాలాజీ జోక్యం చేసుకుంటూ, వినుకొండలో మునిసిపాలిటీయే డిగ్రీ కాలేజీ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతోందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని మునిసిపల్ కార్పొరేషన్ తరఫు న్యాయవాదిని ఆదేశించిన ధర్మాసనం విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది.

ఇలా కుమ్మక్కవుతారు

తామిచ్చిన ఆదేశాల ప్రకారం ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు మొదలు పెట్టగానే, కొందరు హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పిటిషన్లు దాఖలు చేస్తారని, తామిచ్చిన ఉత్తర్వుల సంగతి సింగిల్ జడ్జికి చెప్పకుండా స్టే ఉత్తర్వులు పొందుతారని ధర్మాసనం తెలిపింది. అధికారులు సైతం తమ ఉత్తర్వుల సంగతిని సింగిల్ జడ్జి దృష్టికి తీసుకురారని, ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వుల సంగతి తెలియని సింగిల్ జడ్జి.. పిటిషనర్లకు అనుకూలంగా స్టే ఉత్తర్వులు ఇస్తారని వివరించింది. ఇలా పిటిషనర్లు, రెవెన్యూ అధికారులు కలిసి కుమ్మక్కవుతారని ఘాటుగా వ్యాఖ్యానించింది.

రాజ్యాంగం ఆక్రమించుకోమని చెప్పిందా?

గ్రామ కంఠం భూములను ఆక్రమించుకుని 30-40 ఏళ్ల క్రితమే నిర్మాణాలు చేపట్టారని, ఇప్పుడు హైకోర్టు ఆదేశాలు ఇస్తే అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, తమ వాదన వినకుండా ఆ నిర్మాణాలను కూల్చేస్తారని న్యాయవాది విద్యావతి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కూల్చి వేతలకు ముందు అధికారులు తప్పక వాదనలు వినిపించుకునే అవకాశం ఇస్తారని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ధర్మాసనం తేల్చి చెప్పింది. తమ జీవనాధారాన్ని కూడా చూడాలని, రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కును పరిగణనలోకి తీసుకోవాలని విద్యావతి కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. రాజ్యాంగం ప్రభుత్వ భూములను ఆక్రమించుకోమని చెప్పిందా? అని ప్రశ్నించింది.

రెవెన్యూ అధికారుల వల్లే ఆ పరిస్థితి

ప్రభుత్వ న్యాయవాది సుభాష్ స్పందిస్తూ.. దాదాపు 5 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణల్లో ఉందని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ, ఇందులో రెవెన్యూ అధికారుల పాత్ర కూడా ఉందని తెలిపింది. రెవెన్యూ అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యం, అవినీతి కారణంగానే ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరిగిపోయాయని స్పష్టం చేసింది. ఈ సమయంలో ఓ న్యాయవాది స్పందిస్తూ, గుంటూరులో శ్మశాన వాటికను ఆక్రమించుకుని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. శ్మశానంలో షాపింగ్ కాంప్లెక్సా అంటూ ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. కాగా, వివిధ రకాల ఆక్రమణలపై దాఖలైన 55 పిటిషన్లకు సంబంధించి తగిన ఉత్తర్వులు జారీ చేసేందుకు వీలుగా వ్యాజ్యాలను ప్రభుత్వ భూముల ఆక్రమణ, చెరువుల ఆక్రమణ, శ్మశానాల ఆక్రమణ, తదితర అంశాల వారీగా ధర్మాసనం విభజించింది. వీటిపై తదుపరి విచారణ నిమిత్తం కొన్నింటిని బుధవారం, మరి కొన్నింటిని గురువారానికి, ఇంకొన్నింటిని సోమవారానికి వాయిదా వేసింది.

పీజీటీ, టీజీటీలపై కఠిన చర్యలొద్దు

• హాస్టల్ వార్డెన్ విధులు నిర్వర్తించాలని ఒత్తిడి చేయొద్దు
• ఆదివారం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్న వారి సేవలే వాడుకోండి
• పాఠశాల విద్యాశాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి : మోడల్ స్కూళ్లకు అనుబంధంగా ఉన్న బాలికల హాస్టళ్ల వార్డెన్లు వారాంతపు సెలవు తీసుకున్నప్పుడు ఆ బాధ్యతలను రొటేషన్ పద్ధతిపై నిర్వర్తించేందుకు ముందుకు రాని పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ)పై కఠిన చర్యలేవీ తీసుకోవద్దని హైకోర్టు పాఠశాల విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. వార్డెన్ విధులు నిర్వర్తించాలని ఒత్తిడి చేయవద్దని ఆదేశించింది. వార్డెన్ విధులకు సిద్ధమైన పీజీటీ, టీజీటీలకే బాధ్యతలు అప్పగించాలని స్పష్టంచేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెలవు రోజున అసలు వార్డెన్ స్థానంలో పీజీటీ, టీజీటీలు పనిచేయాలన్న నిబంధన కఠినమైనదే అయినప్పటికీ, ఏపీ స్టేట్ అండ్ సబార్డినేట్ రూల్స్ 1996లోని రూల్ 10(ఎ) ప్రకారం యజమాని ఆదేశాలను ఉద్యోగి పాటించి



తీరాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. హాస్టళ్ల నిర్వహణకు అవసరమైన పోస్టులను సృష్టించి, అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు తగిన యత్నాలు చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా హాస్టల్ డ్యూటీ నుంచి పీజీటీ, టీజీటీలకు విముక్తి కల్పించాలన్నారు. వార్డెన్లు వారాంతపు సెలవు తీసుకున్నప్పుడు ఆ బాధ్యతలను రొటేషన్ పద్ధతిలో నిర్వర్తించాలంటూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ పలువురు పీజీటీ, టీజీటీలు దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ మన్మథరావు విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది పి.రాజేష్ బాబు వాదనలు వినిపిస్తూ, విద్యా శాఖాధికారులు ఇచ్చిన ప్రొసీడింగ్స్ చట్ట విరుద్ధమని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ తరఫున న్యాయవాది కేవీ రఘువీర్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ ఉద్యోగులైన పీజీటీ, టీజీటీలు సర్వీసు రూల్స్ ప్రకారం ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సిందేనన్నారు. వారు నెలకో, రెండు నెలలకో ఓ రోజున వార్డెన్‌గా పని చేయాల్సి ఉంటుందన్నారు.

రెండో రోజు కొనసాగిన అమరావతి జేఏసీ పాదయాత్ర

మంగళగిరి: అమరావతిని రాజధానిగా కొనసాగించాలంటూ అమరావతి టూ అరసవల్లికి అమరావతి జేఏసీ చేపట్టిన పాదయాత్ర రెండవ రోజు మంగళగిరి మీదుగా కొనసాగింది. మంగళవారం ఉదయం పట్టణంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించి ద్వారకానగర్, రాజీవ్‌సెంటర్, తెనాలి ఫ్లై ఓవర్‌ల మీదుగా వెళ్లి పెదవడ్లపూడి, రేవేంద్రపాడుల మీదుగా దుగ్గిరాల చేరుకుంది. పాదయాత్రకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజధాని మార్చడం ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. సీఆర్‌డీఏ చట్టం మార్చవద్దని హైకోర్టు తీర్పు చెప్పినా ప్రభుత్వం తన ధోరణి మార్చుకోకుండా మూడు రాజధానులంటూ ప్రకటనలు చేయడం దుర్మార్గమన్నారు. కాగా, పెదవడ్లపూడిలో బీజేపీ నేత, జెడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం, టీడీపీ యువ నాయకుడు జువ్వాది చందు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో చందు వర్గం యాత్ర నుంచి తిరుగుముఖం పట్టింది. పాదయాత్రలో టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.



మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన పాదయాత్ర

ఆ జీఓలపై స్టే ఇవ్వం

▶ మొదటి పేజీ తరువాయి

ఇవ్వలేమని తెలిపింది. తదుపరి విచారణను అక్టోబర్ 11కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఏజీ చెప్పిన వివరాలను పరిగణనలోకి..

పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం జారీచేసిన జీఓలను సవాలు చేస్తూ తాజాగా ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ డి. రమేశ్‌చంద్ర సింహగిరి పట్నాయక్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంతో పాటు ఇదే అంశంపై గతంలో దాఖలైన వ్యాజ్యాలు మంగళవారం సీజే ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. విలీనం, హేతుబద్ధీకరణ ప్రభుత్వ విధాన నిర్ణయమన్నారు. ఇందులో ఇప్పటికే అధిక శాతం అమలైందన్నారు. అమలు తాలుకు ఫలితాలెలా ఉన్నాయన్న దానిపై సమీక్ష చేయాల్సి ఉందని వివరించారు. ఏజీ చెప్పిన వివరాలను పరిగణనలోకి తీసుకుని విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈ సమయంలో పిటిషనర్ల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. ఈ వ్యాజ్యాలపై అత్యవసర విచారణ జరపాల్సిన అవసరం ఉందని, విచారణను రెండు వారాలకు వాయిదా వేయాలని కోరారు. కానీ, ఈ వ్యవహారంలో ఎలాంటి స్టే ఇచ్చేదిలేదని ధర్మాసనం స్పష్టంచేసింది.

సీఐడీ కేసును కొట్టేయండి

• అరెస్ట్ నుంచి రక్షణ కల్పించండి
• హైకోర్టులో చింతకాయల విజయ్ పిటిషన్

సాక్షి, అమరావతి : హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ అధికారులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య మంగళవారం విచారణ జరిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలు తమ ముందుంచాలని సీఐడీని ఆదేశించారు. తదుపరి విచారణను 15కి వాయిదా వేశారు. అంతకు ముందు పిటిషనర్ తరఫు న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ.. నకిలీ అశ్లీల వీడియోను సృష్టించి, టీడీపీకి చెందిన ఐ టీడీపీ గ్రూప్‌లో వ్యాప్తి చేసి తన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్నారంటూ గోరంట్ల మాధవ్ సీఐడీకి ఫిర్యాదు చేశారని తెలిపారు. వాస్తవానికి యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) ఫోన్ నంబర్ సాయంతో ఆ వీడియోను ఐ టీడీపీ గ్రూప్‌లో అప్‌లోడ్ చేశారని, దాంతో పిటిషనర్‌కు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఈ కేసులో విజయ్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని, అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని అభ్యర్థించారు.

నారాయణ స్వాహా.. బంధుగణంతో 'అసైన్డ్' మేత

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి ముసుగులో టీడీపీ పెద్దల మరో భూబాగోతం బట్టబయలైంది. దళితులు, బలహీన వర్గాలకు చెందిన 1,110 ఎకరాల అసైన్డ్, లంక భూములను కొల్లగొట్టిన వ్యవహారం వెలుగు చూసింది. చంద్రబాబు సర్కారు అక్రమాల చిట్టాను సీఐడీ అధికారులు ఆధారాలతో సహా వెలికితీశారు. అసైన్డ్ భూముల దోపిడీ వ్యవహారంపై దుగ్గిరాలకు చెందిన వై.ప్రసాద్‌కుమార్ ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసి చేపట్టిన దర్యాప్తులో మొత్తం అక్రమాల బండారం బయటపడింది. దళితులను బెదిరించి అసైన్డ్ భూములను కాజేయడంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సన్నిహితుడు, బినామీగా గుర్తింపు పొందిన మాజీ మంత్రి పొంగూరు నారాయణే కీలకంగా వ్యవహరించారు. రామకృష్ణా హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నారాయణ తన కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితుల పేరిట 169.27 ఎకరాల అసైన్డ్ భూములను కొల్లగొట్టినట్లు తేలింది. ఇందులో నారాయణతోపాటు మాజీ మంత్రి గంటా పాత్ర కూడా స్పష్టంగా వెలుగులోకి వస్తోంది.

పలు సెక్షన్ల కింద కేసులు.. ఐదుగురి అరెస్టు

అసైన్డ్ భూములను హస్తగతం చేసుకున్న కేసులో మాజీ మంత్రి పి.నారాయణను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ అసైన్డ్ భూముల బదిలీ నిషేధిత చట్టం 1977, ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంతో పాటు 409, 420, 506 తదితర సెక్షన్ల కింద సీఐడీ అధికారులు తాజాగా కేసులు నమోదు చేశారు. ఈ కుంభకోణంలో పాత్రధారులుగా వ్యవహరించిన నారాయణ సన్నిహితులైన ఐదుగురిని సీఐడీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. రామకృష్ణా హౌసింగ్ లిమిటెడ్ సిబ్బంది కొల్లి శివరామ్, గట్టెం వెంకటేశ్‌ను రాత్రి విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో హాజరు పరచగా 41 ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులిచ్చి దర్యాప్తు కొనసాగించాలని న్యాయమూర్తి ఆదేశించారు. మరో ముగ్గురు నిందితులను విశాఖలో అరెస్టు చేసి విజయవాడ తరలించారు.

పరిహారం రాదంటూ ఫలహారం..

టీడీపీ హయాంలో పురపాలక శాఖ మంత్రిగా వ్యవహరించిన నారాయణ కనుసన్నల్లోనే భూ దందాలు జరిగాయి. ప్రధానంగా టీడీపీ పెద్దల కళ్లు అమరావతిలోని 1,100 ఎకరాల అసైన్డ్, పోరంబోకు, లంక భూములపై పడ్డాయి. అవన్నీ దళితులు, బలహీన వర్గాలకు చెందినవే. అసైన్డ్ భూముల క్రయ విక్రయాలు చట్ట విరుద్ధమని అప్పటి సీఆర్‌డీయే కమిషనర్, గుంటూరు కలెక్టర్‌లతోపాటు పలువురు అధికారులు నారాయణకు వివరించినా ఖాతరు చేయలేదు. వాటిని సొంతం చేసుకునేందుకు పక్కాగా పథకం వేశారు. రాజధాని కోసం అసైన్డ్ భూములను ప్రభుత్వం ఎలాంటి పరిహారం చెల్లించకుండా తీసుకుంటుందని రెవెన్యూ, పురపాలక శాఖ అధికారుల ద్వారా ప్రచారం చేయించారు. నారాయణ ఆదేశాలతో అధికారులు గ్రామాల్లో పర్యటించి కేవలం పట్టా భూములకే సర్వేలు చేశారు. అసైన్డ్ భూములకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం తీసుకుంటుంది కాబట్టి సర్వే చేయడం లేదని అధికారులతో ప్రచారం చేయించారు. ఇదే అదనుగా నిరు పేదలైన దళితులు, బీసీల భయాందోళనలను సొమ్ము చేసుకునేందుకు నారాయణ తన సమీప బంధువైన కేవీపీ అంజని కుమార్ డైరెక్టర్‌గా ఉన్న రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే రియల్ ఎస్టేట్ సంస్థను రంగంలోకి దించారు. అసైన్డ్ భూములను తాము కొనుగోలు చేస్తామని, లేదంటే అవన్నీ ప్రభుత్వ పరమైపోతాయని రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు పేదలను నమ్మించారు. వారిని బెదిరించి అతి తక్కువ ధరకు వాటిని తమపరం చేసుకున్నారు. నారాయణ అందుకోసం రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాల ద్వారా లావాదేవీలు నిర్వహించారు. అసైన్డ్ భూములున్న వారికి నగదు చెల్లింపులు చేసి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ(జీపీఏ) పొందారు. అనంతరం సేల్ డీడ్‌ల ద్వారా కథ నడిపించారు.

వియ్యంకుడితో భూ విందు!

అమరావతిలో టీడీపీ పెద్దలు కొల్లగొట్టిన 1,100 ఎకరాల్లో 169.27 ఎకరాల అసైన్డ్ భూములను మాజీ మంత్రి పొంగూరు నారాయణ తన బంధువులు, సన్నిహితుల పేరిట దక్కించుకున్నట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. అందులో 89.90 ఎకరాలను బంధువుల పేరిట నారాయణ కొల్లగొట్టగా మరో 79.45 ఎకరాలను ఆయన వియ్యంకుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు సమీప బంధువుల పేరిట గుప్పిట పట్టారు. నారాయణ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల నుంచి రూ.15 కోట్లు రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బదలాయించి అసైన్డ్ భూములను కాజేసినట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. కాగా 1,100 ఎకరాల అసైన్డ్, పోరంబోకు, లంక భూముల్లో మిగిలినవి టీడీపీ ముఖ్యులు, వారి కుటుంబ సభ్యులు, బినామీల పేరిట ఉన్నాయి. వాటిపై సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది.

ఇటు కాజేసి.. అటు లాగేసి!

మాజీ మంత్రి నారాయణ తన బంధువులు, సన్నిహితుల ద్వారా 89.90 ఎకరాల అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. రిజిస్ట్రేషన్ చట్టం 22-ఏ కింద నిషేధిత భూముల జాబితాలో ఉన్న వీటిని పకడ్బందీగా సొంతం చేసుకున్నారు. ఈ భూములు అమరావతిలోని అనంతవరం, కృష్ణాయపాలెం, కురగల్లు, లింగాయపాలెం, మందడం, నెక్కల్లు, నవులూరు, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెం పరిధిలో ఉన్నాయి. నారాయణ వీటిని 84 సేల్ డీడ్ల ద్వారా తన బంధువులు, సన్నిహితులైన ధూళిపాళ్ల వెంకట శివ పానకాలరావు, ఆయన భార్య పద్మావతి, కోడలు డి.సృజన, లక్ష్మిశెట్టి సుజాత, లక్ష్మిశెట్టి సూర్య నారాయణ, అంబటి సీతారాము, లక్కాకుల హరిబాబు, లక్కాకుల పద్మావతి, చిక్కాల విజయ సారథి, పరుచూరి వెంకయ్య భాస్కరరావు, పరుచూరి వి.ప్రభాకరరావు (గంటా బంధువులు), కొండయ్య బాలసుబ్రహ్మణ్యం, భార్య కొండయ్య విజయ, కొండయ్య వెంకటేశ్ తదితరుల పేర్లతో కొనుగోలు చేశారు. నారాయణ తన బంధువులు, సన్నిహితులైన యాగంటి శ్రీకాంత్, కొల్లి శివరామ్, గుమ్మడి సురేశ్ పేరిట ఏకంగా 72 జీపీఏలు చేసి మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించారు. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు అప్పటి సబ్ రిజిస్ట్రార్ ఏ.గోపాల్ నిరాకరించారు. ఆయనపై టీడీపీ పెద్దలు ఎంత ఒత్తిడి తెచ్చినా సమ్మతించలేదు. దీంతో అసైన్డ్ భూములపై తాము చేసుకున్న సేల్ డీడ్ల ఆధారంగానే ఆ భూములను నారాయణ బంధువులు హస్తగతం చేసుకున్నారు. అనంతరం ఆ అసైన్డ్ భూములను రాజధాని కోసం ప్రభుత్వం సమీకరించినప్పుడు వాటిని తామే సీఆర్‌డీయేకు ఇచ్చినట్లుగా చూపించారు. అందుకు ప్రతిగా రాజధాని ప్రాంతంలో అభివృద్ధి చేసిన ప్లాట్లు, వాణిజ్య స్థలాలు పొందే జాబితాలో తమ పేర్లు ఉండేలా చేసుకున్నారు. తద్వారా భూసమీకరణ కింద ఇచ్చిన భూములకు ప్రతిగా ఎకరానికి 800 గజాల నివాస స్థలం, వంద గజాల వాణిజ్య స్థలాన్ని రాజధాని ప్రాంతంలో తమకు వచ్చేటట్లు చూసుకున్నారు.

సీఐడీ అరెస్టు చేసిన ఐదుగురు నిందితులు

▲ కొల్లి శివరామ్, విజయవాడ (రామకృష్ణా హౌసింగ్ లిమిటెడ్ ఉద్యోగి)
▲ గట్టెం వెంకటేశ్, విజయవాడ (రామకృష్ణా హౌసింగ్ లిమిటెడ్ ఉద్యోగి)
▲ చిక్కాల విజయ సారథి, విశాఖపట్నం
▲ బడే ఆంజనేయులు, విశాఖపట్నం
▲ కొట్టి కృష్ణ దొరబాబు, విశాఖపట్నం

గంటా కోటాలో మరో 79.47 ఎకరాలు

అమరావతిలో మరో 79.47 ఎకరాల అసైన్డ్ భూములను కూడా నారాయణ తన వియ్యంకుడైన గంటా శ్రీనివాసరావు బంధువులు, సన్నిహితుల ద్వారా దక్కించుకున్నారు. బోరుపాలెం, కురగల్లు, లింగాయపాలెం, మందడం, నెక్కల్లు, నేలపాడు, నవులూరు, రాయపూడి, తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం, వెంకటపాలెంలోని వివిధ సర్వే నంబర్లలో 79.47 ఎకరాలను 76 సేల్ డీడ్ల ద్వారా తమపరం చేసుకున్నారు. కొట్టి కృష్ణ దొరబాబు, గుమ్మడి సురేశ్, కొల్లి శివరామ్‌లు వాటిపై జీపీఏ ఒప్పందాలు చేసుకుని ఆ భూములు తమకు చెందినవని చూపారు. దళారీలు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి, గుమ్మడి సురేశ్, సఫియుల్ రహమాన్, పొట్లూరి జయంత్, ఆల వెంకట సుబ్బయ్య, పిడపర్తి టిటుస్ బాబు, శీలం శ్రీనివాసరావు తదితరులు ఈ అసైన్డ్ భూములను నారాయణ తన బంధుగణం ద్వారా దక్కించుకోవడంలో పాత్ర పోషించారు. కాగా సీఐడీ అధికారులు అరెస్టు చేసిన కొట్టి కృష్ణ దొరబాబు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు నమ్మిన బంటు కావడం గమనార్హం. టీడీపీ హయాంలో గంటా మంత్రిగా ఉండగా ఆయన్ను ఆంధ్రా వర్సిటీ దూరవిద్యా కేంద్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కాంట్రాక్టు విధానంలో నియమించారు. జాగ్రఫీలో పీహెచ్‌డీ చేసిన ఆయన ఉద్యోగం పొందిన సమయంలో వర్సిటీలో అలాంటి కోర్సు లేకున్నా అవకాశం కల్పించారు.

టీడీపీ నేత నారాయణకు బెయిల్ చట్టబద్ధం కాదు

చిత్తూరు న్యాయస్థానంలో ఏపీజీ సుధాకర్‌రెడ్డి ఆక్షేపణ

చిత్తూరు అర్బన్: పదో తరగతి ప్రశ్నపత్రం మాల్‌ప్రాక్టీస్ వ్యవహారంలో టీడీపీ నేత, మాజీ మంత్రి నారాయణకు మేజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేయడం చట్టబద్ధం కాదని రాష్ట్ర అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) సుధాకర్‌రెడ్డి ఆక్షేపించారు. చిత్తూరులో ఈ ఏడాది పదో తరగతి ప్రశ్నపత్రం మాల్‌ప్రాక్టీస్ వ్యవహారంలో నారాయణ విద్యాసంస్థలకు చెందిన పలువురు ఉపాధ్యాయులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. టీడీపీ నేత, మాజీ మంత్రి నారాయణను కూడా హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. అయితే అదే రోజు చిత్తూరు న్యాయస్థానం నారాయణకు బెయిల్ ఇచ్చింది. దీన్ని రద్దు చేయాలంటూ ప్రాసిక్యూషన్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఇప్పటికే చిత్తూరులోని 9వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తన వాదనలు వినిపించారు. నారాయణ తరఫున మంగళవారం డి. రమేష్ తన వాదనలు వినిపించారు. నారాయణకు బెయిల్ చట్టపరిధిలోనిదేనని తెలిపారు. దీనిపై ఏఏజీ సుధాకర్‌రెడ్డి అభ్యంతరం తెలుపుతూ తన వాదనలు మరోమారు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సెషన్స్ కోర్టు జడ్జి విచారణను ఈ నెల 20కి వాయిదా వేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం ॥ 14-9-2022

కళ

మారుమూల గ్రామాల్లో ఉన్న మహిళలు చదువుకోలేకపోవచ్చు. కానీ, వారి చేతుల్లో అందమైన మన ప్రాచీన కళావైభవం దాగుంటుంది. తరతరాలుగా వస్తున్న ఆ వైభవం ఇప్పటికీ మనల్ని ఆకట్టుకుంటూనే ఉంటుంది. ఆ కళల పట్ల ఉన్న వారి ప్రతిభను ఆ గ్రామాలకే పరిమితం అవడం లేదు. దేశ సరిహద్దులు దాటుతున్నాయి. మన దేశీయ హస్తకళలకు విదేశాల్లో ఉన్న డిమాండ్‌ను గమనించి, ప్రాచీన హస్తకళలకు తిరిగి జీవం పోస్తున్న వారెందరో తమతో పాటు వేలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఎదుగుతున్నారు.

విలేజ్ నుంచి విదేశాలకు





క్రొచెట్ అల్లిక

ఉత్తర్‌ప్రదేశ్‌లోని డియోరియా జిల్లాలోని సురోలి గ్రామానికి చెందిన పూజా షాహి ఊళ్లో తయారు చేసిన హస్తకళలను అమెరికా–జర్మనీ దేశాలకు ఎగుమతి చేస్తోంది. 2009లో కొంత మందితో మొదలుపెట్టిన చిన్న స్టార్టప్ నేడు లక్షల టర్నోవర్ సాధిస్తోంది. నిరక్షరాస్యులైన ఇక్కడి మహిళలు తయారు చేసిన హస్తకళలను ఇప్పుడు అమెరికా, జర్మనీలకు పంపుతున్నారు. అమ్మమ్మల కాలపు కళగా పేరొందిన క్రొయేషియా కళ ఇప్పుడు ప్రపంచవ్యాప్తమైంది. దీనికి విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఇక్కడి గ్రామీణ మహిళల జీవితాలను మార్చేసింది. 'నేను ఇంటర్మీడియెట్ వరకు చదివాను. చిన్నప్పటి నుండి మా అమ్మ క్రొయేషియా నుండి వివిధ వస్తువులను తయారు చేయడం చూశాను. వాటి నుండి చాలా ప్రేరణ పొందాను. మెల్లగా నా చెయ్యి కూడా క్రొచెట్ అల్లడం మొదలుపెట్టింది. రకరకాల బొమ్మలు, అలంకరణ వస్తువులు క్రొచెట్‌తో తయారు చేస్తూ, ఆర్డర్ల ద్వారా వాటిని ఇస్తుండేదాన్ని. తర్వాత్తర్వాత నా చుట్టూ మా ఊళ్లో ఉన్న మహిళలపైన దృష్టి పెట్టాను. ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటిపని, వంట పని, పిల్లలపని.. దీంట్లో ఉండిపోతారు. ఈ ఆడవాళ్లు డబ్బు ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటే వారి అదృష్టం మారుతుందనుకున్నాను. అలా, వారి చేత కూడా సోఫాకవర్లు, టీవీ కవర్లు, ఊయల, వాల్ హ్యాంగర్లు, ఫొటో ఫ్రేములు, కర్టెన్లు, బాటిల్ హోల్డర్లు, వాలెట్లు తయారు చేయించేదాన్ని. 'జాగృతి యాత్ర' సంస్థ పరిచయం అయ్యాక ఈ ఉత్పత్తులను ఎలా అమ్మాలి అనే విషయాలపై అవగాహన వచ్చింది. 'డియోరియా డిజైన్' పేరుతో కంపెనీ ప్రారంభించాను. ఇది ఇప్పుడు సంపాదన క్రాఫ్ట్‌గా మారింది. 100 రకాల అలంకార వస్తువులు, 50 రకాలకు పైగా ఆభరణాలు, ఉపకరణాలను తయారుచేస్తున్నాం. వీటిని అమెరికా, జర్మనీ దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. ఇప్పటివరకు 35 వేల మంది మహిళలు శిక్షణ పొందారు. రాబోయే మూడేళ్లలో పదివేల మంది మహిళలు పర్మినెంట్ ఉద్యోగులుగా పని చేయాలన్న లక్ష్యంగా కృషి చేస్తున్నాను. మా డిజైన్స్‌కి 'వన్ డిస్ట్రిక్ట్... వన్ ప్రొడక్ట్' అని పేరు పెట్టారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నన్ను 'దేవి' అవార్డుతో సత్కరించి, మా పనిని అభినందించారు. మొదట్లో నా కుటుంబసభ్యులే నాకు మద్దతుగా నిలవలేదు. కానీ, నేడు నా హస్తకళల పనిలో నిమగ్నమవడంతో నేను విజయం సాధించాను అనిపించింది' అంటారు పూజా షాహి.



ఆశా స్కారియా

కుట్టుపనికి అంతర్జాతీయ మార్కెట్

గుర్తింపు మహిళలకు శక్తినిస్తుంది. ఏదైనా చేయగలరని భావించేలా చేస్తుంది. అప్పుడు వారు తమ విలువను అర్థం చేసుకుంటారు' అంటారు స్వరా బో దబ్ల్యూ ఫౌండర్ ఆశా స్కారియా. కేరళలోని ఎట్టుమనూరు చెందిన ఆశా హస్తకళాకారులను గుర్తించి, వారి కళను మరింత శక్తిమంతం చేస్తుంది. 'మహిళలు ఇంటి నుండి పనిచేస్తారు. వారు బయటకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఉపాధిని కల్పించుకోవడంతో పాటు సాధికారికంగా ఉంచుతుంది' అంటారు ఆమె. స్వరా బ్రాండ్ కళాకారులు తయారుచేసిన చీరలను అంతర్జాతీయంగా మార్కెట్ చేస్తుంది. దేశమంతటా గ్రామీణ మహిళల్లో దాగున్న ప్రాచీన కుట్టుపని నైపుణ్యాలను పెంపొందింపజేస్తుంది. ప్రస్తుతం పశ్చిమబెంగాల్, కేరళకు చెందిన కళాకారులతోపాటు దుంగార్‌పూర్‌లోని వారితోనూ, మహిళా కళాకారులను సమీకరించిన స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తుంది. అంతేకాదు, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని మహిళలు లేదా మానవ అక్రమ రవాణా నుండి రక్షించబడిన మహిళలకు మద్దతుగా స్వరా పనిచేస్తుంది.

కళల పట్ల అభిరుచితో...



సుర్భి అగర్వాల్

సుర్భి అగర్వాల్ జోధ్‌పూర్‌లో స్పెషాలిటీ హాస్పిటల్‌ను నడుపుతున్న తన కుటుంబ వ్యాపారాన్ని విడిచిపెట్టి కళ పట్ల ఆమెకున్న అభిరుచిని అందిపుచ్చుకుంది. దేశంలోని వెనుకబడిన మహిళలకు సహాయం చేయాలనుకుంది. రాజస్థాన్‌లోని గ్రామీణ ప్రాంతాల్లోని హస్తకళాకారులతో కలిసి, గృహాలంకరణ ఉత్పత్తులను తయారుచేయడానికి 'ది ఆర్ట్ ఎక్సోటికా'ను ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా హస్తకళాకారులతో కలిసి గృహాలకంరణ ఉత్పత్తులను తయారు చేయిస్తూ, వాటిని అంతర్జాతీయంగా ఎగుమతి చేస్తోంది. ఈశాన్య రాష్ట్రాల్లోని నేత కార్మికులకు సహాయం చేయడానికి ఆమె తన గ్యారేజ్ నుంచి వర్క్ ప్రారంభించింది. జర్మనీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, స్వీడన్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడా దేశాలకు హస్తకళలను, చేనేత ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది సుర్భి.



"నెల నెలా డాక్టర్ దగ్గరకు వెళ్తున్నావా"
"న్యూట్రిషనిస్ట్ ఇచ్చిన డైట్ చార్ట్ ప్రకారం తింటున్నావా"
"రోజూ వాకింగ్ చేస్తే డెలివరీ సులువవుతుంది"
"నీకేం తినాలని ఉందో చెప్పు... చేసి పంపిస్తాను"
గర్భిణికి ఇలాంటి ఆత్మీయ పలకరింపులెన్నో.
ఆత్మీయతలు... ఆనందాలు బయటకు కనిపిస్తాయి.
ఆమె మనసు పడే సంఘర్షణ బయటకు కనిపించదు.
ఆమె మనసు మౌనంగా మాట్లాడుతుంది.
జీవిత భాగస్వామి ఆ మనసు భాషను అర్థం చేసుకోవాలి.
తగిన సహకారం అందించాలి.

భరోసా ఇవ్వాలి బాధ్యతగా ఉండాలి

భర్తలకూ కౌన్సెలింగ్

గర్భిణులకు క్రమం తప్పకుండా డాక్టర్ చెకప్ చేసుకోవాలని చెబుతుంటాం. పోషకాహారం గురించి కూడా ప్రత్యేకంగా మాట్లాడుతుంటాం. వ్యాయామం ఎంత అవసరమో సూచిస్తుంటాం. బంధువుల్లో కానీ స్నేహితుల్లో కానీ ఒకమ్మాయి గర్భం దాల్చిందని తెలియగానే ఫోన్ చేసి అభినందనలు చెబుతూ రకరకాల పరామర్శల్లో భాగంగా పై జాగ్రత్తలన్నీ చెబుతుంటాం. మరొక అడుగు ముందుకు వేసి మనసును ప్రశాంతంగా ఉంచుకోమనే ఓ మంచిమాట కూడా. అయితే గర్భంతో ఉన్న మహిళకు ఈ జాగ్రత్తలతోపాటు సైకాలజిస్ట్ కౌన్సెలింగ్ కూడా అవసరమనే సున్నితమైన విషయాన్ని చెప్పేవాళ్లుండరు. 'సైకాలజిస్ట్‌ను సంప్రదించడం ఎందుకు? ఏ మానసిక సమస్య ఉందని' అనే ప్రతిస్పందన కొంచెం ఘాటుగా కూడా వినిపిస్తుంటుంది. 'నిజానికి పై జాగ్రత్తలన్నింటితోపాటు మానసిక విశ్లేషకుల సలహాలు, సూచనలు కూడా అవసరమే. ఆ సూచనలు గర్భంతో ఉన్న మహిళకు మాత్రమే కాదు భర్తకు కూడా' అంటున్నారు క్లినికల్ సైకాలజిస్ట్ కాంతి.

ఇద్దరికీ కౌన్సెలింగ్

''ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకున్నప్పటి నుంచి ఇద్దరికీ కౌన్సెలింగ్ ఉండాలి. తల్లి కావాలనే అందమైన ఆకాంక్ష ప్రతి మహిళకూ ఉంటుంది. అలాగే మాతృత్వం గురించిన మధురోహలతోపాటు అనేకానేక భయాలు కూడా వెంటాడుతుంటాయి. ప్రసారమాధ్యమాల్లో వచ్చే అనేక దుర్వార్తల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. తన బిడ్డకు అలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయేమోననే భయం వెంటాడుతూ ఉంటుంది. ఆమె తన భయాలను భర్తతో పంచుకున్నప్పుడు వచ్చే ప్రతిస్పందన చాలా కీలకం. నిర్లక్ష్యంగానో, విసుగ్గానో రెస్పాండ్ అయితే గర్భిణి మనసుకయ్యే గాయం చాలా తీవ్రంగా ఉంటుంది. అందుకే గర్భిణిలో తలెత్తే శారీరక, మానసికమైన మార్పుల గురించిన అవగాహన భర్తకు ఉండి తీరాలి. అందుకే కౌన్సెలింగ్‌కి ఇద్దరూ రావాలని చెబుతాం. కొంత మంది భర్తలు ప్రెగ్నెంట్ ఉమన్‌తో వాళ్ల తల్లిని లేదా సోదరిని పంపిస్తుంటారు. ఎట్టి పరిస్థితిలోనూ ఇలాంటి రాజీలు ఉండకూడదని చెబుతుంటాం. భార్య మానసిక స్థితిలోని సున్నితత్వం స్థాయిలు భర్తకు అర్థమైనప్పుడే అతడు భార్యకు అన్ని వేళల్లోనూ అండగా నిలబడగలుగుతాడు. మెంటల్ వెల్‌బీయింగ్ గురించిన అవగాహన ఇద్దరిలో ఉన్నప్పుడే పాపాయిని జాగ్రత్తగా చూసుకోవడంలో కూడా పరిణతితో వ్యవహరించగలుగుతారు.

మూడో వ్యక్తికి సాదర స్వాగతం

సాధారణంగా మన ఇళ్లలో గర్భిణిగా ఉన్నప్పుడు ఆమెను అందరూ అపురూపంగా చూసుకుంటూ ఉంటారు. డెలివరీ తర్వాత బాధ్యతలన్నీ ఆమె భుజాల మీద మోపుతూ జాగ్రత్తల పేరుతో ఆమెను కట్టడి చేస్తుంటారు. నిజానికి ఈ దశలో భర్త సపోర్టు చాలా అవసరం. పోస్ట్ పార్టమ్ డిజార్డర్ ఒక్కొక్కరిలో ఒక్కో స్థాయిలో ఉంటుంది. మహిళ తన జీవితం ఒక్కసారిగా స్తంభించి పోయినట్లు భావిస్తుంది. ఒంటరితనం, నెగెటివ్ థాట్స్, 'అందరూ సంతోషంగా ఉన్నారు... నా జీవితమే ఇలాగైంది, సోషల్ లైఫ్‌కు దూరంగా ఇంట్లో నాలుగ్గోడలకే పరిమితమైపోయింది జీవితం... అని దిగులు పడడం వంటి ఆలోచనలన్నీ వస్తుంటాయి. ఎందుకంటే చాలామంది మగవాళ్లకు తండ్రి అయిన తర్వాత కూడా లైఫ్‌స్టయిల్ ఏమీ మారదు. ఆడవాళ్ల విషయంలో అందుకు పూర్తిగా భిన్నం. అలాంటప్పుడే భర్త పట్టించుకోవడం లేదనే న్యూనత కూడా మొదలవుతుంది. అందుకే పోస్ట్ డెలివరీ ప్రిపరేషన్ గురించి డెలివరీకి ముందే భార్యాభర్తలిద్దరినీ మానసికంగా సిద్ధం చేయడం జరుగుతుంది. మగవాళ్లు తండ్రి అయిన సంతోషాన్ని బయట స్నేహితులతో సెలబ్రేట్ చేసుకోవడం సరికాదు, ఇంట్లోనే స్నేహితులతో గెట్ టు గెదర్ ఏర్పాటు చేసి భార్యను కూడా వేడుకలో భాగస్వామ్యం చేయాలి. పెటర్నిటీ లీవ్ సౌకర్యం ఉంటుంది. ఆ సెలవు తీసుకుంటారు, కానీ భార్యకు సహాయంగా ఉండక ఇతర వ్యాపకాలతో గడిపే వాళ్లూ ఉంటారు. కానీ తమ కుటుంబంలో మూడో వ్యక్తికి స్వాగతం పలికే క్రమంలో ప్రతి దశలోనూ భర్తను భాగస్వామ్యం చేయగలిగితే ఇలాంటి పరిణామాలుండవని నా అభిప్రాయం.

> డెలివరీ అయిన మహిళలకు దేహాకృతి విషయంలో ఎక్కడ లేని ఆందోళన మొదలవుతుంటుంది. దేహం తిరిగి మామూలు కాదనే భయం వెంటాడుతుంటుంది. మరికొందరు... నా బిడ్డకు నేను చేయాల్సినంత చేయడం లేదేమో. నేను మంచి తల్లిని కాలేనేమో అని బాధపడుతుంటారు. ఒక్కొక్కరైతే తమలో తామే బాధపడుతూ మౌనంగా రోదిస్తుంటారు. పెద్దగా వెక్కి వెక్కి ఏడుస్తారు కూడా. భావోద్వేగ పరమైన అసమతుల్యతకు లోనవుతున్న విషయాన్ని గుర్తించలేకపోతారు. మా కౌన్సెలింగ్‌లో భార్యాభర్తలిద్దరికీ ఇలాంటి విషయాలన్నింటి మీద అవగాహన కల్పిస్తాం. కాబట్టి భార్య మానసికంగా న్యూనతకు లోనయినప్పుడు ఎమోషనల్ సపోర్టు ఇవ్వాలనే విషయం మగవాళ్లకు తెలుస్తుంది.
> – ఎమ్. కాంతి, క్లినికల్ సైకాలజిస్ట్ హైదరాబాద్



చర్చ కావాలి... వాదన వద్దు!

ఇక చంటి బిడ్డను చూడడానికి ఇంటికి వచ్చిన వాళ్లు కూడా 'ఫలానా ఆమె తన బిడ్డను కింద పెట్టకుండా ఒంటి చేత్తో పెంచుకుంటోంది' వంటి స్టేట్‌మెంట్‌లు అలవోకగా ఇచ్చేస్తుంటారు. ఆ మాటల ప్రభావంతో అన్నీ తనే చూసుకుంటూ సూపర్ మామ్ కావాలనే అవసరం లేని పట్టుదలకు కూడా పోతుంటారు చంటిబిడ్డల తల్లులు. ఇలాంటి కామెంట్‌లకు ప్రభావితం కాకుండా, విపరీత పరిణామాలకు తావివ్వకుండా ఉండాలి. భార్యాభర్తల మధ్య డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ రోల్స్, రెస్పాన్సిబిలిటీస్ గురించి ఇద్దరికీ అవగాహన ఉంటే చంటిబిడ్డను పెంచడంలో భార్యాభర్తలిద్దరూ సమంగా బాధ్యతలు పంచుకోగలుగుతారు. ప్రతి విషయాన్నీ చక్కగా చర్చించుకోవాల్సిన అవసరాన్ని తెలియచేస్తాం. అలాగే ఇద్దరి మధ్య డిస్కషన్ వాదనకు దారి తీయకూడదనే హెచ్చరిక కూడా చేస్తాం. సామరస్యమైన చర్చ ద్వారా సమస్యలకు పరిష్కారాలు కనిపిస్తాయి. వితండ వాదన వివాదానికి దారి తీస్తుంది. మన సంప్రదాయ పెంపకంలో... మగవాళ్లను అనేక విషయాలకు దూరంగా ఉంచడమే జరిగింది ఇంతవరకు. భార్యకు ఎమోషనల్ సపోర్టు ఇవ్వడం, బిడ్డ పెంపకంలో బాధ్యతను పంచుకుంటూ బాలింతకు విశ్రాంతినివ్వడం వంటివేవీ మగవాళ్లకు తెలియచేయడం ఉండదు. అందుకే ఏ విషయంలోనైనా భర్త తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుంటే అది అతడికి ఎలా స్పందించాలో తెలియక పోవడం కూడా అయి ఉండవచ్చు. అపోహ పడడానికి ముందు అతడికి తెలియచేసే ప్రయత్నం చేయాలని కూడా మహిళలకు చెబుతుంటాం. భార్యకు ధైర్యం చెప్పి అండగా నిలవాల్సిన బాధ్యతను భర్తకు గుర్తు చేస్తుంటాం'' అన్నారు కాంతి.

– వాకా మంజులారెడ్డి

యూత్ పల్స్

చిగురాకులలో చిలకమ్మా వినైల్ రికార్డ్ వినరావమ్మా!



'గత కాలము మేలు వచ్చు కాలం కంటే' అని గట్టిగా అనుకున్నారో లేదో తెలియదుగానీ... ఈతరంలో ఇప్పుడు ఒక కొత్త ధోరణి మొదలైంది. గత కాల వైభవం... వినైల్ రికార్డ్ కల్చర్ వైపు అడుగులు వేస్తున్నారు. ఫిజికల్ మ్యూజిక్ ఫార్మట్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ స్పోటిఫై, యాపిల్ మ్యూజిక్ జమానాలో పాతదనాన్ని కొత్తగా ఆస్వాదిస్తున్నారు....

దిల్లీలోని కన్నాట్‌ప్లేస్‌లో 'ది రేడియో అండ్ గ్రామ్‌ఫోన్ హౌజ్' ఉంది. 1951లో మొదలైన ఈ గ్రామ్‌ఫోన్ హౌజ్‌లో యువతరం సందడి కనిపిస్తుంది. ఇక్కడినుంచి ముంబైలోని రివాల్వర్ క్లబ్‌కు వెళదాం. 2017లో మొదలైన ఈ వినైల్ స్టోర్ యువ సంగీత అభిమానులకు ఫేవరెట్ స్పాట్.

వినైల్ రికార్డ్‌లను విని ఆనందించడంతో పాటు వాటిని సేకరించే విషయంలోనూ యూత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.

వినైల్ లవర్ నెహాల్ షా తన అభిరుచిని విస్తరిస్తూ 'ఇండియా రికార్డ్' ఆన్‌లైన్ స్టోర్ ప్రారంభించింది.

'ఒకప్పుడు వినైల్ కలెక్టర్ అనగానే ఫిఫ్టీ ప్లస్ వాళ్లు ఉండేవారు. ఒక చల్లని సాయంత్రం విస్కీ సేవిస్తూ, సిగర్ కాల్చుతూ వినైల్ రికార్డ్ వింటున్న పెద్దల దృశ్యం కళ్లకు కట్టేది. అయితే ఇప్పుడు దృశ్యం మారిపోయింది. యంగర్ జనరేషన్ వినైల్ మీడియంతో కనెక్ట్ అవుతోంది. పాత తరం సంగీత వైభవాన్ని వినైల్‌ల రూపంలో తమ ఇంటికి తీసుకువెళుతున్నారు' అంటుంది షా.

> కాస్త కొత్తగా ఉంటుంది అని వినైల్ ప్రపంచంలోకి వచ్చాను. అయితే వచ్చాక తెలిసింది ఇది ఎంత గొప్ప అనుభవమో. కాస్త ఖరీదైన అభిరుచి అయినప్పటికీ ఇకముందు కూడా కొనసాగించాలని అనుకుంటున్నాను.
> – శాన్వీ

తమ కొనుగోలుదారులలో 45 శాతం 30 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారే అని చెబుతుంది షా.

బెంగళూరు నుంచి ఎక్కువ ఆర్డర్లు వస్తుంటాయట.

వినైల్ ప్రేమికులను ఆకట్టుకోవడానికి బెంగళూరులో 'వినైల్ బార్' మొదలైంది.

విని ఆస్వాదించడం, కొనుగోలు చేయడం మాత్రమే కాదు స్నేహితులకు గిఫ్ట్‌లుగా ఇచ్చే ధోరణి మొదలైంది.

యువతరం వినైల్ క్రేజ్‌ను చూసి 'వినైల్ రికార్డ్ ఫర్ సేల్' ఆన్‌లైన్ ప్రకటనలు మొదలయ్యాయి. మరోవైపు క్లా స్టాగ్‌లాంటి పోర్టబుల్ వినైల్ రికార్డ్ ప్లేయర్స్ మార్కెట్‌లోకి వచ్చి ఆకట్టుకుంటున్నాయి. బ్లూటూత్, బిల్ట్–ఇన్ స్టీరియో స్పీకర్స్ దీని ప్రత్యేకత.

ఈ 'క్లా స్టాగ్' తెరిస్తే రికార్డ్ ప్లేయర్ అవుతుంది. మూస్తే సూట్‌కేస్ లాగా మారిపోతుంది. దీన్ని ఎక్కడి కంటే అక్కడికి సులభంగా తీసుకువెళ్ల వచ్చు.

'కాస్త కొత్తగా ఉంటుంది అని వినైల్ ప్రపంచంలోకి వచ్చాను. అయితే వచ్చాక తెలిసింది ఇది ఎంత గొప్ప అనుభవమో. కాస్త ఖరీదైన అభిరుచి అయినప్పటికీ ఇక ముందు కూడా కొనసాగించాలనుకుంటున్నాను' అంటుంది చెన్నైకి చెందిన 22 సంవత్సరాల శాన్వీ.

మరోవైపు సామాజిక మాధ్యమాల్లో వినైల్ ముచ్చట్లు ఊపందుకుంటున్నాయి.

'వేర్ టు గెట్ రికార్డ్స్?' అని పుసుక్కున ఎవరైనా అడిగితే బోలెడు సమాధానాలు ప్రత్యక్షమవుతున్నాయి.

'దిల్లీలోని న్యూ గ్రామ్‌ఫోన్ హౌజ్‌లో క్వాలిటీ వినైల్ రికార్డ్ కలెక్షన్ ఉంది' అంటారు ఒకరు.

మరొకరు 'అక్కడే కాదు ఇక్కడ కూడా' అంటూ వేరొక వివరం చెబుతారు.

ఫేస్‌బుక్‌లో పేరు పక్కన 'వినైల్ కలెక్టర్' అని పెట్టుకొని మురిసిపోతున్న వారి సంఖ్య తక్కువేమీ కాదు.

'కమ్‌బ్యాక్ కష్టమే అని అనుకున్నవి తిరిగి వస్తే ఆ సంతోషమే వేరు. వినైల్‌లను నాతోపాటు నా మనవరాలు కూడా ఎంజాయ్ చేస్తుంది. కాలమహిమ అంటే ఇదేనేమో' అని మురిసిపోతున్నాడు ముంబైకి చెందిన మనోహర్‌రావు.

'వైబ్రెంట్ మ్యూజిక్ ఎక్స్‌పీరియన్స్' ఒక్క మాటలో తన ఇష్టాన్ని తెలియజేసింది రావు మనవరాలు నేహా.

అక్షరాలా నిజమే కదా!

బ్యూటిప్స్

ఆరోగ్యంగా అందంగా ఉంచే క్రీమ్

బీట్‌రూట్ అలోవెరా జెల్‌తో తయారు చేసిన క్రీమ్‌ను ముఖానికి రాసుకుంటే చర్మం ఆరోగ్యంగా ఉండడమేగాక, అందంగా కనిపిస్తుంది. మార్కెట్లో దొరికే క్రీమ్ కంటే ఇంట్లో తయారు చేసినది మరింత బాగా పనిచేస్తుంది.

- రెండు టీస్పూన్ల బీట్‌రూట్ రసంలో రెండు టీస్పూన్ల అలోవెరా జెల్‌ను వేసి జెల్‌లా చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గాలిచొరబడని కంటైనర్‌లో వేసి నిల్వ చేసుకోవాలి.
- ముఖాన్ని శుభ్రంగా కడిగి తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు బీట్‌రూట్ క్రీమ్‌ను ముఖానికి రాసి మర్దన చేయాలి. ఈ క్రీమ్ రాసిన తరవాత ఇతర క్రీములుగానీ, జెల్స్‌గానీ రాయకూడదు.
- రోజూ క్రమం తప్పకుండా ఈ క్రీమ్ అప్లై చేయడం వల్ల ముఖం మీద మొటిమలు, చిన్నచిన్న పొక్కులు, మచ్చలు తగ్గిపోతాయి.
- అలోవెరా జెల్‌లో తొంభై శాతం నీరు ఉండడం వల్ల చర్మానికి మాయిశ్చర్ అందుతుంది.
- ఈ క్రీమ్‌లోని విటమిన్స్, ఖనిజపోషకాలు, సాల్సిలిక్ ఆమ్లం, లిగ్నిన్, సపోనిన్, ఎమినో యాసిడ్స్ చర్మసమస్యలను తగ్గిస్తాయి.





కిచెన్ టిప్స్



- కొన్ని రకాల కూరగాయలను ముక్కలు తరిగాక చేతులు ఒకవిధమైన వాసన వస్తుంటాయి. ఇటువంటప్పుడు చేతుల మీద కొద్దిగా టూత్ పేస్టు వేసి బాగా రుద్ది కడిగితే చేతుల నుంచి వచ్చే వాసన వదిలి పోతుంది.
- ఘాటు వాసన వచ్చే ఫేస్ పౌడర్‌ను స్టవ్ మీద వేసి రాత్రంతా ఉంచాలి. ఉదయాన్నే తడివస్త్రంతో తుడిచేయాలి. ఇలాచేస్తే స్టవ్ మీద ఉన్న జిడ్డు, దుర్వాసన పోవడమే గాక, బల్లులు, కీటకాలు వంటివి ఏవీ స్టవ్ మీద వాలవు.
- నూనెడబ్బాలు ఎంత కడిగినా జిడ్డుగానే కనిపిస్తుంటాయి. ఇలాంటప్పుడు టేబుల్ స్పూను రాళ్ల ఉప్పు, టీస్పూను డిష్ వాష్ లిక్విడ్ వేసి మెత్తటి స్క్రబ్బర్‌తో రుద్ది, నీటితో కడగాలి. డబ్బాలో మిగిలి పోయిన జిడ్డంతా పోయి తళతళ మెరుస్తాయి.
- డబ్బాల్లో పప్పులు పోసి నిల్వచేస్తుంటాము. కానీ కొద్దిరోజులకు వాటిలో తేమ వల్ల పురుగు పడుతుంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే కొబ్బరి తీసేసిన తరువాత చిప్పలను పీచులేకుండా శుభ్రంగా గీకాలి. పీచు మొత్తం పోయి నున్నగా మారిన చిప్పలను పప్పు డబ్బాల్లో వేసి ఉంచాలి. ఈ చిప్పలు డబ్బాల్లోని తేమను పీల్చుకుని పురుగు రాకుండా చేస్తాయి. పప్పులు వేసుకోవడానికి కూడా ఈ చిప్పలు కప్పుల్లా చక్కగా ఉపయోగపడతాయి.







స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 456 60,571	నిఫ్టీ ▲ 134 18,070

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	11,814	▽	452
డోజోన్స్	31,525	▽	855
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,386	▽	87
డాక్స్	13,189	▽	213
షాంఘై	3,264	▲	2
నికాయ్	28,614	▲	73

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఒకేసారి రెండు ఉద్యోగాలు కుదరదు..

సిబ్బందికి ఇన్ఫీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ఓవైపు తమ దగ్గర పనిచేస్తూనే మరోవైపు ఇంకో ఉద్యోగం కూడా చేయడాన్ని (మూన్‌లైటింగ్) అనుమతించేది లేదంటూ ఉద్యోగులకు ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ స్పష్టం చేసింది. అలా చేస్తే నిబంధనలను ఉల్లంఘించినట్లేనని పేర్కొంది. దీనికి గాను తగు క్రమశిక్షణా చర్యలు ఎదుర్కొనాల్సి వస్తుందని, ఉద్యోగం నుంచి కూడా తొలగించే అవకాశాలు ఉన్నాయని సిబ్బందికి రాసిన అంతర్గత లేఖలో యాజమాన్యం గట్టిగా హెచ్చరించింది. ఏకకాలంలో రెండు ఉద్యోగాలు చేయకూడదంటూ ఉద్యోగులకు ఇచ్చే ఆఫర్ లెటర్‌లో ఉండే నిబంధనలను ఈ సందర్భంగా ప్రస్తావించింది. 'సిబ్బంది హ్యాండ్ బుక్, నైతిక నియమావళి ప్రకారం రెండు ఉద్యోగాలకు అనుమతి ఉండదు. పనివేళల్లో లేదా పనివేళలు ముగిసిన తర్వాతనైనా రెండో ఉద్యోగం చేయడాన్ని మూన్‌లైటింగ్‌గా వ్యవహరిస్తారు. ఈ తరహాలో రెండు చోట్ల ఉద్యోగాలు చేయడాన్ని ఇన్ఫోసిస్ ప్రోత్సహించదు. నిబంధనలను ఉల్లంఘిస్తే ఉద్యోగం నుంచి తొలగించడం సహా క్రమశిక్షణా చర్యలు ఎదుర్కొనాల్సి రావచ్చు' అని ఇన్ఫీ పేర్కొంది. తమ కింది సిబ్బందికి ఈ విషయంలో అవగాహన కల్పించాలని మేనేజర్లకు సూచించింది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	50,676	▼	187
బంగారం (99.5 స్వచ్ఛత)	50,473	▼	186
వెండి (కిలో)	57,270	▲	1333

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-9-2022	
విశాఖ	450-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	66.00
13-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	370-00
వరంగల్	372-00
రిటైల్ ధర	4.30

రూపాయి 'వాణిజ్యం'పై దేశాల ఆసక్తి

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

న్యూఢిల్లీ: రూపాయి మారకంలో ద్వైపాక్షిక వాణిజ్యంపై పలు దేశాలు ఆసక్తి వ్యక్తం చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. కేవలం రూబుల్ (రష్యా కరెన్సీ)–రూపాయి మారకంలో వాణిజ్యానికే పరిమితం కాకుండా ఇతరత్రా కరెన్సీలకూ వర్తించేలా రిజర్వ్ బ్యాంక్ ప్రత్యేక విధానాన్ని రూపొందించడం సానుకూలాంశమని ఆమె పేర్కొన్నారు. ఈ చర్యలతో భారత ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికి మించి స్వేచ్ఛా విపణిగా మారగలుగుతోందని మైండ్‌మైన్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. మహమ్మారి అనంతరం భారత్ అనేక వినూత్న ప్రయోగాలను ఆవిష్కరిస్తోందని నిర్మలా సీతారామన్ చెప్పారు.



మైండ్‌మైన్ సదస్సులో ప్రసంగిస్తున్న ఆర్థికమంత్రి

ప్రైవేట్ రంగం హనుమంతుడిలాంటిది..

విదేశీ ఇన్వెస్టర్లు కూడా భారత్‌పై నమ్మకంగా ఉన్నప్పుడు దేశీయంగా ప్రైవేట్ సంస్థలు తయారీలో పెట్టుబడులు పెట్టడానికి ఎందుకు వెనుకాడుతున్నారో తెలియడం లేదని నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. పరిశ్రమకు ఏవైనా సమస్యలు ఉంటే చర్చించేందుకు, పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె పేర్కొన్నారు. హనుమంతుడిలాగా పరిశ్రమకు తన శక్తి సామర్థ్యాలపై నమ్మకం లేని పరిస్థితి కనిపిస్తోందని మంత్రి వ్యాఖ్యానించారు. 'పరిశ్రమ హనుమాన్‌లాగా మారిందా? మీ సామర్థ్యాలపై మీకు నమ్మకం కలగడం లేదా. ఎవరైనా మీ పక్కన నిల్చుని, మీకు హనుమంతుడి అంత శక్తి సామర్థ్యాలు ఉన్నాయి .. ముందుకు కదలండి అని చెప్పాల్సిన అవసరం ఉందా? అలా హనుమంతుడికి ప్రస్తుతం చెప్పేవారు ఎవరున్నారు. పరిశ్రమ కదిలి వచ్చి ఇన్వెస్ట్ చేసేందుకు ఏమేమి చేయగలదో అంతా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అయినప్పటికీ ఎందుకు వెనుకాడుతున్నారో మీ నుంచి వినాలని ఉంది' అని ఆమె పేర్కొన్నారు.

మహిళా సిబ్బందితో టాటా మోటార్స్ షోరూం

హైదరాబాద్: టాటా మోటార్స్ తన డీలర్ భాగస్వామి వెంకటరమణ మోటార్స్‌తో కలిసి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో మహిళా సిబ్బందితో ప్యాసింజర్ వెహికల్స్ షోరూంని ఇటీవల ప్రారంభించింది. మొత్తం 20 మంది మహిళా బృందంతో ఏర్పాటు చేసిన ఈ అవుట్‌లెట్ దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి ''మహిళా షోరూం'' అని కంపెనీ తెలిపింది. పెరుగుతున్న మహిళా కస్టమర్లను దృష్టిలో ఉంచుకొని ఈ తరహా షోరూంను ప్రారంభించాము. నాయకత్వాన్ని కోరుకునే మహిళలకు ఈ కేంద్రం అంకితమని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ సేల్స్ ప్రెసిడెంట్ రాజన్ అంబా తెలిపారు.



ఐదు నెలల గరిష్టానికి సూచీలు

నాలుగో రోజూ బుల్ పరుగులు • సెన్సెక్స్ లాభం 456 పాయింట్లు •18,050 పైకి నిఫ్టీ



ముంబై: ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు నిరాశపరిచినా.., నాలుగు రోజు బుల్ పరుగులు తీసింది. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల ధోరణి సూచీల ర్యాలీకి కలిసొచ్చింది. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు వెల్లువలా వస్తుండటం, క్రూడాయిల్ ధరలు దిగిరావడం, రూపాయి బలపడటం తదితర అంశాలు సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఆర్థిక, బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్లతో మంగళవారం సెన్సెక్స్ 456 పాయింట్లు పెరిగి అయిదు నెలల గరిష్ట స్థాయి 60,571 వద్ద స్థిరపడింది. ఈ ఏడాది ఏప్రిల్ నాలుగో తేదీ తర్వాత నిఫ్టీ ఇండెక్స్ తొలిసారి 18 వేల స్థాయిపైన ముగిసింది. మొత్తంగా 134 పాయింట్లు బలపడి 18,050 పైన 18,070 వద్ద నిలిచింది. ఐటీ, ప్రభుత్వరంగ బ్యాంక్స్, రియల్టీ, ఇంధన షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ద్రవ్యోల్బణ డేటా వెల్లడి తర్వాత అమెరికా మార్కెట్ రెండుశాతం నష్టాల్లో ట్రేడవుతోంది. ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 36 పైసలు బలపడి నెల గరిష్టస్థాయి రూ.79.17 వద్ద ముగిసింది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,540 పాయింట్లు, నిఫ్టీ 445 పాయింట్లు లాభపడ్డాయి.

18 వేల స్థాయిపై ట్రేడింగ్ ప్రారంభం

మార్కెట్ ప్రారంభం నుంచి పటిష్ట బాటన నడిచింది. సెన్సెక్స్ 293 పాయింట్లు బలపడి 60,408 వద్ద, నిఫ్టీ 108 పాయింట్లు పెరిగి 18,044 వద్ద మొదలయ్యాయి. ప్రధాన సూచీలు కీలకమైన నిరోధ స్థాయిలను అధిగమించిన నేపథ్యంలో అన్ని రంగాల కౌంటర్లు కొనుగోళ్లతో కళకళలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 520 పాయింట్లు బలపడి 60,635 వద్ద, నిఫ్టీ 152 పాయింట్లు దూసుకెళ్లి 18,088 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి.

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌లో బ్లాక్ డీల్

• హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ ఒకశాతానికి పైగా లాభపడి రూ.587 వద్ద స్థిరపడింది. యూకే ఆధారిత ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ అబ్రడెన్ ... హెచ్‌డీఎఫ్‌సీకి చెందిన 4.3 కోట్ల షేర్లను బ్లాక్ డీల్ ద్వారా రూ.2,425 కోట్లకు విక్రయించేందుకు సిద్ధమైంది.

సెకండ్ హ్యాండ్ కార్లకే మొగ్గు

మెట్రోల్లో ప్రతి ఇద్దరిలో ఒకరు ఇంతే • నాన్ మెట్రోల్లో రెండో వంతు ఓటు • ఏటా 20 శాతం మేర వృద్ధి • డాస్ వెల్ట్ ఆటో నివేదిక

ముంబై: కొత్త కార్ల కంటే.. అప్పటికే వేరొకరు వాడి విక్రయించే వాటి వైపు (ప్రీఓన్డ్ కార్లు) వినియోగదారులు పెద్ద మొత్తంలో మొగ్గుచూపిస్తున్నారు. కొత్త కారుతో పోలిస్తే సెకండ్ హ్యాండ్ కారు చాలా తక్కువ ధరకు రావడం వినియోగదారులను ఆకర్షిస్తోంది. వినియోగ కార్ల మార్కెట్ ఏటా 19.5 శాతం చొప్పున 2026–27 వరకు వృద్ధిని చూపిస్తుందని డాస్‌వెల్ట్ ఆటో, ఇండియన్ బ్లూబుక్ సంయుక్తంగా ప్రీఓన్డ్ కార్ల మార్కెట్‌పై ఓ సవివర నివేదికను విడుదల చేశాయి. ఇందులో డాస్ వెల్ట్ ఆటో అన్నది ఫోక్స్‌వ్యాగన్ ప్రీఓన్డ్ కార్ల కంపెనీ కావడం గమనించాలి. దేశంలోని టాప్ 40 పట్టణాల్లో ప్రీఓన్డ్ కార్లకు ఏటా డిమాండ్ 10 శాతం మేర పెరగనుండగా, మిగిలిన పట్టణాల్లో అయితే ఇది ఏటా 30 శాతం మేర వృద్ధి సాధిస్తుందని ఈ నివేదిక అంచనా వేసింది. 2021–22లో ప్రీఓన్డ్ కార్ల మార్కెట్ విలువ 23 బిలియన్ డాలర్లుగా (రూ.1.84 లక్షల కోట్లు) ఉన్నట్టు తెలిపింది.

మారిన మార్కెట్ తీరు

గతంతో పోలిస్తే సెకండ్ హ్యాండ్ కార్ల మార్కెట్ తీరు తెన్నుల్లో ఎంతో మార్పు వచ్చింది. ఆయా కార్లను కంపెనీలు సర్టిఫై చేస్తున్నాయి. తక్కువ వ్యవధికే కార్లు, ద్విచక్ర వాహనాలను మార్చే ధోరణి కూడా పెరిగింది. దీంతో ఇంచుమించు కొత్త వాహనాలే అయినా తక్కువ ధరలకు లభిస్తుండడం వినియోగదారులను ఆకర్షిస్తోంది. కంపెనీలు ఎప్పటికప్పుడు కొత్త మోడళ్లతో ఆర్జనా శక్తి కలిగిన కస్టమర్లను లక్ష్యం చేసుకుంటున్నాయి. బైబ్యాక్ ఆఫర్లను కూడా ఇస్తున్నాయి. ఇవన్నీ కలసి ప్రీఓన్డ్ కార్ల మార్కెట్‌ను పరుగెత్తిస్తున్నట్టు ఈ నివేదిక అభిప్రాయపడింది. పైగా సంఘటిత రంగంలో ప్రీఓన్డ్ కార్లు, ద్విచక్ర వాహనాల వ్యాపారంలోకి కొత్త సంస్థలు ప్రవేశిస్తుండడం కూడా ఈ మార్కెట్ బలోపేతానికి సహకరిస్తోంది.

35 లక్షల కార్ల విక్రయం..

గడిచిన ఆర్థిక సంవత్సరంలో 35 లక్షల ప్రీఓన్డ్ కార్లు అమ్ముడుపోయాయి. అంతకుముందు సంవత్సరం రికార్డులను అధిగమించింది. ఇక అదే ఏడాది అంతర్జాతీయంగా విక్రయాలు 4 కోట్లుగా ఉన్నట్టు వెల్లడించింది. ''మరిన్ని సంస్థలు ప్రీఓన్డ్ వాహన మార్కెట్లోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో రోడ్డు పక్కన మెకానిక్ గ్యారేజీలు, బ్రోకర్ల ద్వారా జరిగే సెకండ్ హ్యాండ్ వాహనాల విక్రయ లావాదేవీలు సంఘటిత రంగానికి క్రమంగా మళ్లుతున్నాయి''అని ఈ నివేదిక తెలిపింది. సంఘటిత రంగం మార్కెట్ వాటా ప్రీఓన్డ్ కార్ల విభాగంలో 2021–22 నాటికి 20 శాతం ఉంటే, 2025–26 నాటికి 45 శాతానికి పెరుగుతుందని అంచనా వేసింది. 2026–27 నాటికి ప్రీఓన్డ్ కార్ల విక్రయాలు 80 లక్షలకు చేరుకోవచ్చని తెలిపింది. కరోనా తర్వాత ఈ మార్కెట్ రూపురేఖలే మారిపోయినట్టు పేర్కొంది. 2021–22లో ప్రీఓన్డ్, కొత్త కార్ల రేషియో 1:4గా ఉండగా, ఇది 2026–27 నాటికి 1:9కు చేరుకుంటుందని తెలిపింది. నాన్ మెట్రోల్లో 64 శాతం మంది ప్రీఓన్డ్ కారును తమ మొదటి వాహనంగా చేసుకుంటుంటే, మెట్రోల్లో ఇలాంటి వారు 55 శాతం ఉన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో సరఫరా అయిన మొత్తం ప్రీఓన్డ్ కార్లలో 65 శాతం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై, ఢిల్లీ ఎన్‌సీఆర్ లోనే ఉన్నాయి.



భవిత

• ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ ఆఫీసర్

714 ఎస్ఓ పోస్టుల భర్తీకి ఎస్‌బీఐ నోటిఫికేషన్

దేశంలో అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. పలు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా దేశ వ్యాప్తంగా వివిధ బ్రాంచ్‌ల్లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ కేడర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. » **మొత్తం పోస్టులు:** 714

» **పోస్టుల వివరాలు:** మేనేజర్,రిలేషన్ మేనేజర్, ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్, సీనియర్ రిలేషన్ మేనేజర్,రీజినల్ హెడ్,అసిస్టెంట్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ తదితర పోస్టులున్నాయి. »**విభాగాలు:** డాట్‌నెట్ డెవలపర్,జావా డెవలపర్, బిజినెస్ ప్రాసెస్, ఆపరేషన్స్ టీమ్, బిజినెస్ డెవలప్‌మెంట్ తదితరాలు.

అర్హత

» పోస్టులను అనుసరించి విద్యార్హతలు వేర్వేరు ఉన్నాయి. సంబంధిత స్పెషలైజేషన్‌లో డిగ్రీ/బీటెక్/బీఈ/ఎంటెక్/ఎంఈ/ఎంసీఏ/ఎంఎస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇంజనీరింగ్ /ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌ఇంజనీరింగ్) ఎంబీఏ/పీజీ/పీజీడీఎం ఉత్తీర్ణత ఉండాలి.

» **వయసు:** పోస్టును అనుసరించి 01.04.2022 నాటికి 20–50ఏళ్లు ఉండాలి.

» **అనుభవం:** సంబంధిత విభాగంలో కనీసం రెండేళ్ల పని అనుభవం తప్పనిసరి.

ఎంపిక ఇలా

షార్ట్‌లిస్టింగ్, ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూలో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మేనేజర్, ఇంజనీర్ ఉద్యోగాలకు మాత్రం దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేసి, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. అందులో ప్రతిభ ఆధారంగా నియామకాలు చేపడతారు.

పరీక్ష విధానం

ఆన్‌లైన్ పరీక్షలో రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ ఐటీ నాలెడ్జ్, రోల్ బేస్డ్ నాలెడ్జ్‌కు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు మొత్తం 70 శాతం మార్కులుంటాయి. ఇంటర్వ్యూకి 30 శాతం మార్కులు కేటాయిస్తారు.

జేఎంజీఎస్-1

ఈ పోస్టులకు సంబంధించి జనరల్ ఆప్టిట్యూడ్ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 50 ప్రశ్నలకు 50 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 ప్రశ్నలకు 35 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 మార్కులకు 35 ప్రశ్నలను అడుగుతారు. పరీక్ష సమయం 90 నిమిషాలు.

ఎంఎంజీఎస్

ఈ పోస్టులకు సంబంధించి ప్రొఫెషనల్ నాలెడ్జ్ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో జనరల్ ఐటీ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు–50 మార్కులు, రోల్ బేస్డ్ నాలెడ్జ్ నుంచి 100 మార్కులకు 50 ప్రశ్నలను ఇస్తారు. పరీక్ష సమయం 70 నిమిషాలు ఉంటుంది.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నంలలో పరీక్ష కేంద్రాలున్నాయి. అలాగే తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి హైదరాబాద్, వరంగల్‌లో పరీక్ష కేంద్రాలు ఉంటాయి.

ముఖ్యమైన సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరి తేది:** 20.09.2022
» **వెబ్‌సైట్:** www.sbi.co.in/web/careers

సీఐఎస్‌ఎఫ్‌లో 540 ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్).. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (స్టెనోగ్రాఫర్), హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్) పోస్టుల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 540
» **పోస్టుల వివరాలు:**
» **అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్(స్టెనోగ్రాఫర్):** 122(పురుషులు–94,మహిళలు–10,డిపార్ట్‌మెంటల్–18).
» **హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్):** 418 (పురుషులు–319, మహిళలు–36, డిపార్ట్‌మెంటల్–63).
» **అర్హత:** ఇంటర్మీడియట్ లేదా సీనియర్ సెకండరీ స్కూల్(10+2) సర్టిఫికేట్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **జీతం:** నెలకు ఏఎస్ఐ పోస్టులకు రూ.29,200 నుంచి రూ.92,300, హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు రూ.25,500 నుంచి రూ.81,100 వరకు చెల్లిస్తారు.
» **ఎంపిక:** ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంటేషన్, రాత పరీక్ష/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.10.2022
» **వెబ్‌సైట్:** www.cisfrectt.in

ఆర్మీ పబ్లిక్ స్కూల్స్‌లో.. టీచర్ పోస్టులు

» ఆర్మీ స్కూల్స్‌లో ప్రైమరీ, టీజీటీ, పీజీటీ పోస్ట్‌ల భర్తీకి ప్రకటన
» జాతీయ స్థాయిలో 136 ఆర్మీ స్కూల్స్‌లో కొలువుదీరే అవకాశం
» 2023–24లో ఖాళీల నియామకానికి ఎంపిక ప్రక్రియ

బీఈడీ, డీఈడీ పూర్తి చేశారా.. టెట్, సీటెట్ పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించారా.. ఉపాధ్యాయ వృత్తిలో చక్కటి కెరీర్ కోసం ఎదురు చూస్తున్నారా.. మీకోసం ఆర్మీ పబ్లిక్ స్కూల్స్‌లో టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. దీనిద్వారా ప్రైమరీ, టీజీటీ, పీజీటీ పోస్ట్‌లలో.. కొలువుదీరే అవకాశం కల్పిస్తోంది.. ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ(ఏడబ్ల్యూఈఎస్)!! దేశ వ్యాప్తంగా ఈ సొసైటీ పరిధిలోని 136 ఆర్మీ పబ్లిక్ స్కూల్స్‌లో.. వచ్చే విద్యా సంవత్సరంలో.. ఏర్పడనున్న ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఆర్మీ పబ్లిక్ స్కూల్స్‌లో టీచర్ పోస్ట్‌లు, అర్హతలు, ఎంపిక విధానం గురించి తెలుసుకుందాం..

దేశ వ్యాప్తంగా ఉన్న మిలటరీ కంటోన్మెంట్స్, మిలటరీ స్టేషన్స్ పరిధిలో.. మొత్తం 136 ఆర్మీ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ కోసం ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో ప్రత్యేక విభాగాన్ని సైతం నెలకొల్పారు. ప్రతి ఏటా ఆయా క్లస్టర్ల పరిధిలో ఏర్పడే ఖాళీలకు సంబంధించి ఈ సొసైటీ పోస్ట్‌ల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడుతుంది. తాజాగా 2023–24లో ఏర్పడే ఖాళీలకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సొసైటీ నిర్వహించే రాత పరీక్షలో మార్కుల ఆధారంగా.. ఆయా క్లస్టర్లలోని పాఠశాలలు వేర్వేరుగా విడుదల చేసే నియామక నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అన్ని క్లస్టర్లు, పాఠశాలలను పరిగణనలోకి తీసుకుంటే.. రెండు వేలకు పైగా ఖాళీలు భర్తీ చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

అర్హతలు

- **ప్రైమరీ టీచర్స్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డీఈడీ ఉండాలి.బీఈడీ ఉత్తీర్ణులు కూడా ఈ పోస్ట్‌లకు అర్హులే. వీరు ఉద్యోగంలో చేరిన రెండేళ్లలోపు ఆరు నెలల వ్యవధిలోని పీడీపీఈటీ/ఎన్‌సీటీఈ నిర్వహించే బ్రిడ్జ్ కోర్సులో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- **టీజీటీ:** కనీసం యాభై శాతం మార్కులతో డిగ్రీతోపాటు సంబంధిత సబ్జెక్ట్‌తో బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి.
- **పీజీటీ:** యాభై శాతం మార్కులతో సంబంధిత స్పెషలైజేషన్‌తో పీజీ ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే పోస్ట్‌లకు సంబంధించిన సబ్జెక్ట్‌తో బీఈడీ ఉత్తీర్ణులవ్వాలి.
- పీజీటీ కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్‌కు సంబంధించి సీఎస్‌ఈ/ఐటీ బ్రాంచ్‌తో బీటెక్/ పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్/ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్)/బీఎస్సీ–కంప్యూటర్‌సైన్స్/బీసీఏతోపాటు పీజీ డిగ్రీ ఉత్తీర్ణత/పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అండ్ పీజీ డిగ్రీ ఉండాలి.
- ఫిజికల్ ఎడ్యుకేషన్ సబ్జెక్ట్‌కు సంబంధించి.. బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు, ఎన్‌సీటీఈ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంపీఈడీ ఉత్తీర్ణులవ్వాలి. • మిగిలిన అన్ని సబ్జెక్ట్‌లకు సంబంధించి.. సదరు సబ్జెక్ట్‌లో పీజీతోపాటు బీఈడీ ఉత్తీర్ణతను నిర్దేశించారు.
- విద్యార్హతలతోపాటు సీటెట్ లేదా టెట్‌లో అర్హత సాధించి ఉండాలి. తొలి దశ రాత పరీక్ష సమయానికి టెట్/సీటెట్ రాయని వారు కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అలాంటి వారు తుది నియామకం సమయానికి సీటెట్/టెట్ ఉత్తీర్ణత సాధించాలి.
- **వయసు:** తాజా గ్రాడ్యుయేట్లకు ఏప్రిల్ 1, 2023 నాటికి 40ఏళ్లలోపు, పని అనుభవం ఉన్న వారికి 57 ఏళ్లలోపు ఉండాలి.



జాబ్స్ ఇన్ఫో

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఆర్మీ పబ్లిక్ స్కూల్స్‌లో..పీఆర్‌టీ, టీజీటీ, పీజీటీ పోస్ట్‌ల భర్తీకి సంబంధించి నిర్వహించే ప్రక్రియ మొత్తం మూడు దశలుగా ఉంటుంది. తొలి దశలో అభ్యర్థులకు పోస్ట్‌ల వారీగా ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.

తొలి దశ రాత పరీక్ష.. ఇలా

- ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌గా నిర్వహించే తొలి దశ రాత పరీక్ష.. ఆయా పోస్ట్‌లకు వేర్వేరు విధానాల్లో నిర్వహిస్తారు. పరీక్షలో మొత్తం నాలుగు సెక్షన్‌లు 200 ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్ ఏలో బేసిక్ జీకే అండ్ కరెంట్ అఫైర్స్ నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్–బిలో పెడగాజీ, కరిక్యులం అండ్ ఎడ్యుకేషన్ పాలసీ అంశాల నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్–సిలో అకడమిక్ ప్రొఫిషియన్సీ నుంచి 160 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు.
- మూడు పోస్ట్‌లకు సంబంధించి ఇవే విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- పోస్ట్‌ను అనుసరించి వేర్వేరు స్థాయిల్లో ప్రశ్నల క్లిష్టత, సిలబస్ అంశాలు ఉంటాయి.
- ప్రైమరీ టీచర్స్ అభ్యర్థులకు ప్రాథమిక, ప్రిపరేటరీ దశలో పెడగాజీపై ప్రశ్నలు అడుగుతారు.
- టీజీటీ అభ్యర్థులకు సెక్షన్–బిలో మిడిల్ అండ్ సెకండరీ స్టేజ్ పెడగాజీపై ప్రశ్నలు ఉంటాయి.
- పీజీటీ అభ్యర్థులకు సెక్షన్–బిలో సెకండరీ అండ్ సీనియర్ సెకండరీ స్టేజ్ పెడగాజీపై ప్రశ్నలు అడుగుతారు. • సెక్షన్–సి అకడమిక్ ప్రొఫిషియన్సీ విభాగం విషయంలో.. టీజీటీ అభ్యర్థులకు ఒకటి నుంచి అయిదో తరగతి వరకు సైన్స్, సోషల్, మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్, హిందీ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- టీజీటీ సెక్షన్–సిలో ఆరు నుంచి పదో తరగతి వరకు అకడమిక్ నైపుణ్యాలను పరీక్షిస్తారు.
- పీజీటీ సెక్షన్–సిలో పదకొండు, పన్నెండు తరగతుల స్థాయిలో అకడమిక్ నైపుణ్యాలకు సంబంధించిన అంశాలతో ప్రశ్నలు అడుగుతారు.
- అన్ని పోస్ట్‌లకు నిర్వహించే రాత పరీక్ష మూడు గంటల వ్యవధిలో జరుగుతుంది.

రెండో దశ ఇంటర్వ్యూ

- రాత పరీక్షలో నిర్దిష్ట కటాఫ్ మార్కులతో ఉత్తీర్ణత సాధించి, మెరిట్ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూలను మిలటరీ కంటోన్మెంట్స్, స్టేషన్స్‌లో ఉన్న పాఠశాలలు సొంతంగా నిర్వహిస్తాయి. ఇందుకోసం అభ్యర్థులు సదరు పాఠశాలలు ఇచ్చే నోటిఫికేషన్‌కు.. ఆర్మీ స్కూల్ ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ఉత్తీర్ణత ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి.
- శాశ్వత ప్రాతిపదికగా భర్తీ చేసే పోస్ట్‌లకు సంబంధించి సెంట్రల్ సెలక్షన్ బోర్డ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. • దీంతోపాటు నిర్దీత కాల వ్యవధికి ఫిక్స్‌డ్ టర్మ్ పేరుతో కూడా నియామకాలు చేపడతారు. ఈ పోస్ట్‌లకు స్థానిక మిలటరీ వర్గాల ఆధ్వర్యంలోని లోకల్ సెలక్షన్ బోర్డ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

మూడో దశ.. టీచింగ్ స్కిల్స్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ

ఎంపిక ప్రక్రియలో చివరి దశగా పేర్కొనే మూడో దశలో.. టీచింగ్ స్కిల్స్ పరిశీలన, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరిశీలన చేస్తారు. లాంగ్వేజ్ టీచర్స్ అభ్యర్థులకు ఎస్సే, కాంప్రహెన్షన్‌లలో 15 మార్కులు చొప్పున 30 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. దీంతోపాటు అభ్యర్థులకున్న కంప్యూటర్ ఆపరేటింగ్ స్కిల్స్‌ను పరిశీలించేలా కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌ను నిర్వహిస్తారు.

విజయానికి అడుగులు ఇలా

- సెక్షన్–ఎలోని జనరల్ నాలెడ్జ్‌లో సోషల్ సైన్స్, జనరల్ సైన్స్ అంశాలపై పట్టు సాధించాలి.కరెంట్ అఫైర్స్‌లో మంచి మార్కుల కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యత సంతరించుకున్న అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- పెడగాజీ, కరిక్యులం, ఎడ్యుకేషన్ పాలసీ అంశాల విషయంలో శిశు వికాసం, బోధన పద్ధతులు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

మార్కుల సాధనకు

- ఆర్మీ పబ్లిక్ స్కూల్ టీచర్ పోస్ట్‌ల అభ్యర్థులకు కలిసొచ్చే అంశం.. అకడమిక్ ప్రొఫిషియన్సీ విభాగానికి 160 మార్కులు కేటాయించడం. ఈ అవకాశాన్ని అభ్యర్థులు అందిపుచ్చుకుంటే దాదాపు 110 మార్కులు సాధించొచ్చు.
- ప్రైమరీ టీచర్ పోస్టుల అభ్యర్థులు ఒకటి నుంచి అయిదు వరకు సైన్స్, మ్యాథమెటిక్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లిష్ సబ్జెక్ట్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ప్రధానంగా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవడం వల్ల ఈ విభాగంలో మంచి మార్కులు పొందే అవకాశం ఉంది.
- ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ ఆరు నుంచి పదో తరగతి వరకు అన్ని సబ్జెక్ట్‌ల కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా మ్యాథమెటిక్స్‌కు, సైన్స్‌కు సంబంధించి ఆయా అంశాల భావనలు, సూత్రాలపై పట్టు సాధించాలి.
- పీజీటీ అభ్యర్థులు ఎన్‌సీఈఆర్‌టీ 11, 12 తరగతుల పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి కాన్సెప్ట్‌లతోపాటు ప్రతి చాప్టర్ వెనుక ఉండే ప్రాక్టీస్ బిట్స్‌ను సాధన చేయాలి.

ఏ విభాగమైనా.. ఇలా

టీజీటీ, పీజీటీ పలు సబ్జెక్ట్‌లలో నిర్వహించనున్నారు. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి బీఈడీ పుస్తకాలను పునరావలోకనం చేసుకోవాలి. ముఖ్యంగా కంటెంట్, మెథడాలజీ విషయంలో ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి. సీటెట్ పాత ప్రశ్న పత్రాలను అధ్యయనం చేయాలి. దీంతోపాటు ఆర్మీ పబ్లిక్ స్కూల్ ఆన్‌లైన్ టెస్ట్ పాత ప్రశ్న పత్రాలను సాధన చేయడం ద్వారా.. ఆయా విభాగాల్లోని వేర్వేరు అంశాలకు లభిస్తున్న వెయిటేజీపై అవగాహన ఏర్పడుతుంది. దీంతోపాటు ప్రశ్నలు అడుగుతున్న తీరు, సమాధానాలు ఇవ్వాల్సిన విధానంపైనా సన్నద్ధత పొందొచ్చు.

ముఖ్య తేదీలు

- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:అక్టోబర్5, 2022
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: అక్టోబర్ 20, 2022
- ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ తేదీలు: నవంబర్ 5, 6
- ఫలితాల వెల్లడి: నవంబర్ 20, 2022
- పర్సనల్ ఇంటర్వ్యూ,కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్:జనవరి/ఫిబ్రవరి2023లో జరిగే అవకాశం.
- వెబ్‌సైట్: www.awesindia.com
- ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:https://register.cbtexams.in/AWES/Registration